
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
గురువారం 3 ఏప్రిల్ 2025



ఎండీయూ వాహనాల వద్దే ఈకేవైసీ

- రేషన్ షాపుల వద్ద కొలిక్కిరాని ప్రక్రియ
- మూడు జిల్లాల్లో 5 లక్షల పైచిలుకు పెండింగ్
- నెలాఖరు వరకూ గడువు పొడిగింపు..
- ఆ లోగా పూర్తి కాకుంటే రేషన్ కట్..
- ఈ నెల కూడా కనిపించని కందిపప్పు



8

ఉపాధితో.. వలసలకు.. కళ్లెం

- వేసవి వలసల నివారణకు చర్యలు
- మూడు జిల్లాల్లో 1.85 కోట్ల పనిదినాలు
- రోజు కూలి రూ. 300గా ప్రకటన
- ఐదు రకాల పనులకు ప్రాధాన్యం

వేసవిలో వలసల నివారణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించనున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల వారీగా ఉపాధి పనులకు ప్రణాళికలను సిద్ధం చేశారు. మూడు జిల్లాల్లో 1.85 కోట్ల పనిదినాలు కల్పించనున్నారు. గత ఏడాది చేసిన పని దినాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఏడాది పని దినాలను రూపొందించారు. ఏడాది మొత్తంలో నెలల వారీగా ఏ నెలలో ఎన్ని పని దినాలు కల్పించాలన్న నివేదికను సిద్ధం చేశారు. పని దినాలను లక్ష్యాల మేర పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పల్లెల్లో పెద్ద ఎత్తున పనులు చేపట్టనున్నారు.



నరసరావుపేట : ఉపాధి పనుల్లో కూలీలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకం పల్లెలకు ప్రగతి బాటలు వేస్తోంది. పథకంలో పేరు నమోదు చేసుకున్న ప్రతి కూలీకి వంద రోజులు పనిదినాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే పంచాయతీల వారీగా పనులను గుర్తించారు. ప్రతి కూలీకి కనీస వేతనం రూ. 300గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరుగుతోంది. నీటి సంరక్షణ, నీటి నిల్వలో భాగంగా వాగులు వంకలు, కుంటలు చెరువులు, చెక్ డ్యామ్‌ల్లో పూడికతీత పనులతో పాటు ఊట కుంటలు, పంట నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, రహదారుల నిర్మాణం, రైతుల పొలాల్లో ఉద్యాన పండ్లతోటల సాగు, మొక్కల నాటడం వంటి పనులు చేపట్టనున్నారు.

జిల్లా	పని దినాలు
పల్నాడు	74,77,946
గుంటూరు	34,20,809
బాపట్ల	76,56,945

పల్నాడు జిల్లాలో జాబ్ కార్డుల 3.4 లక్షలు జారీ చేశారు. 5.84 లక్షల మంది కూలీలు ఉన్నారు. యాక్టివ్ జాబ్ కార్డులు 2.51 లక్షలు కాగా 4.27లక్షల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. బాపట్ల జిల్లాలో 2.69 లక్షల జాబ్ కార్డులు జారీ చేశారు. 4.75 లక్షల మంది కూలీలను నమోదు చేశారు. 2.05లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. 3.58 లక్షల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. గుంటూరు జిల్లాలో 1.26 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. 2.10 లక్షల మంది కూలీలు ఉన్నారు. యాక్టివ్ జాబ్ కార్డులు 91,815 ఉన్నాయి. 1,44,399 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు.

డ్వామా శాఖ ఇందుకు సంబంధించిన ప్రణాళికను విడుదల చేసింది. రానున్న మూడు నెలల్లో చేపట్టే పనుల జాబితాను రూపొందించింది. ఐదు రకాల పనులకు ప్రాధాన్యం కల్పించారు. పనులు వివరాలు ఇలా ఉన్నాయి. పశువులు గుంపుగా చేరుటకు అనువుగా ఉన్న ప్రదేశములో నీటి తొట్లలను నిర్మిస్తారు. ఈ పనులను 1న ప్రారంభించారు. ఈ నెల 10 కల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

పల్నాడు జిల్లాలో 14,000 సేద్యపు నీటి కుంటలను నిర్మించాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించింది. గుంటూరు జిల్లాలో 8,500, బాపట్ల జిల్లాలో 9,500 సేద్యపు నీటి కుంటల నిర్మాణ లక్ష్యంగా నిర్ణయించారు. లక్ష్యం మేరకు పూర్తి చేయడం. త్వరితగతిన ఇన్లెట్, అవుట్ లెట్, సిల్ట్ ట్రాప్ పనులను పూర్తి చేయనున్నారు.

పంట కాలువ.. ఫీడర్.. సప్లై ఛానల్ పనులు అవసరాన్ని బట్టి పనులు చేయనున్నారు. 3 సంవత్సరాల కాల వ్యవధి పాటించడం. కూలీలకు పూర్తి దినసరి వేతనం రూ. 300 తగినట్లు మార్కింగ్ ఇచ్చి పని చేయించడం. వర్షాకాలం వచ్చే లోపు పంటకాలువ పనులను పూర్తిచేయనున్నారు. విస్తృత స్థాయిలో కూలీలకు పని కల్పించడం. చెరువు.. కుంటలను వాటి అసలు సామర్థ్యం వుండే విధంగా పునరుద్ధరించడం. మట్టి గుంతలను చెరువు కట్ట అడుగు నుండి కట్టఎత్తు కంటే పది రెట్ల దూరం తరువాత తవ్వడం. గ్రూపులు.. కూలీల సంఖ్య ఆధారంగా పూడిక గుంతల కొలతలు కేటాయిస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రకటించిన దినసరి వేతన రేటు రూ. 300 ప్రతి ఒక్కరు పొందే విధంగా ఆయా పనులకు సంబంధించిన ఖచ్చితమైన పని కల్పించే విధంగా మేట్లు శ్రద్ధ వహించాలి. ప్రతి శుక్రవారం రోజ్ గార్ దివస్ సందర్భంగా కూలీలకు ఆయా పనులకు సంబంధించిన దినసరి వేతనంపై ఎప్పటికప్పుడు ఖచ్చితమైనఅవగాహన కల్పిస్తున్నారు.

నేటి నుంచి జూనియర్ కళాశాలలు
పునఃప్రారంభం


- 22 వరకు సీనియర్ ఇంటర్ తరగతులు
- 25 వరకు కళాశాల వసతిగృహాల నిర్వహణ
- విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ



గుంటూరు(విద్య), ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇంటర్ మీడియట్ విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. పరీక్షల అనంతరం నుంచి విద్యార్థులకు సెలవులు ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో సీనియర్ ఇంటర్ తరగతులను గురువారం నుంచి ప్రారంభించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీనియర్ ఇంటర్ తరగతులు పునః ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 22 వ తేదీ వరకు సీనియర్ ఇంటర్ తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసి ద్వితీయ సంవత్సరంలోకి రానున్న విద్యార్థులు తప్పని సరిగా కళాశాలలకు రావాలని ఇప్పటికే ప్రిన్సిపల్స్ నుంచి సందేశాలు అందాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు 65 వేల మంది విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. మార్చిలో జరిగిన పరీక్షలు పూర్తి చేసుకుని ఇప్పటికే విద్యార్థులు సెలవుల్లో ఉన్నారు. తాజాగా తరగతుల ప్రారంభానికి అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వారంతా తిరిగి కళాశాలలకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ద్వితీయ సంవత్సరంలో కనీసం రెండు మూడు యూనిట్లు పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో విద్యార్థులను కళాశాలకు రప్పించేందుకు ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కళాశాలల హాస్టళ్లలో ఈ నెల 25 వరకు ఇంటర్ విద్యార్థులకు వసతి కల్పిస్తారని ప్రిన్సిపల్స్ చెబుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రికార్డులు పంపిణీ చేసేందుకు అధ్యాపకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే అవి కళాశాలలకు వచ్చాయని, విద్యార్థులు తరగతులకు హాజరుకాగానే వాటిని పంపిణీ చేస్తామని ప్రిన్సిపల్స్ వెల్లడించారు.

మండే ఎండల్లో తరగతులా?

ఇదిలా ఉంటే ఇప్పటికే ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్న సమయంలో ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టవద్దని ప్రభుత్వమే సూచిస్తోంది. ఈ పరిస్థితుల్లో జూనియర్ కళాశాలలు ప్రారంభం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. పైగా విద్యార్థులు కళాశాలకు తప్పనిసరిగా రావాలని ఆదేశించడంతో పిల్లల పరిస్థితి ఏమిటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కనీసం ఒక్కపూటైనా తరగతులు నిర్వహించి మధ్యాహ్నం నుంచి సెలవు ఇవ్వాలని కోరుతున్నారు. అయితే ప్రభుత్వం వారి అభ్యర్థనను పట్టించుకోకుండా ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాల్సిందేనని ఇంటర్ బోర్డు నుంచి ఒత్తిడి వస్తోంది.



70 కాదు.. 140 మీటర్లు

దేశంలోనే అతిపెద్దగా అమరావతి ఓఆర్ఆర్

దేశంలోనే అతిపెద్దదిగా.. రాజధాని నగర అభివృద్ధిలో కీలక ప్రాజెక్టుగా.. అద్భుతంగా.. సబర్బన్ రైళ్ల మార్గంతో.. పది వరుసల్లో.. లోపల, వెలుపలి వైపు సర్వీసు రోడ్డుతో.. ఔటర్ రింగురోడ్డు 140 మీటర్ల వెడల్పుతో అమరావతికి ఓ మణిహారంగా నిర్మాణం కానున్నది. గతంలో 70 మీటర్లకు పరిమితం చేసిన కేంద్రం తాజాగా దానిని 140 మీటర్లకు పెంచుతూ ఆమోదం తెలిపింది. రాజధానికి మెరుగైన కనెక్టివిటీ, రహదారి వెంబడి వచ్చే కారిడార్ల ఏర్పాటుతో జరిగే ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధితో అమరావతి నగర విస్తరణను తనదాకా నడిపించడంలో ఈ ఓఆర్ఆర్ పెద్ద ఆకర్షణశక్తిగా పనిచేయనున్నది. భవిష్యత్‌లో అమరావతి నగర ప్రజల జీవన ప్రమాణాల తాలూకు నాణ్యతను బాగా మెరుగుపరచడంలో కూడా ఈ ఓఆర్ఆర్ కీలకపాత్ర పోషించనుంది.

- ఫలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కృషి
- 189.4 కిమీల భూసేకరణకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం
- మూడు దశల్లో.. మూడేళ్లలోపు పూర్తిచేసేలా కాలపరిమితి

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

అమరావతి చుట్టూ ఔటర్‌రింగురోడ్డును దేశంలో కెల్లా అతిపెద్దదిగా నిర్మించాలనుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు అనుకున్న ప్రకారమే కార్యరూపం దాల్చుతున్నాయి. ఔటర్‌రింగు రోడ్డును 189.4 కి.మీ.ల పొడవునా 150 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేయాలన్న చంద్రబాబు పట్టుదల ముందు కేంద్రం తలొగ్గింది. గత ఫిబ్రవరిలో ఓఆర్ఆర్ వెడల్పును 70మీటర్లకు పరిమితం చేస్తూ కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆరు వరుసల రహదారిగా నిర్మించాలని, లోపలి వైపున మాత్రమే సర్వీసు రోడ్డును నిర్మిస్తే సరిపోతుందని కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ నిర్ణయించింది. ఈ మేరకు భూసేకరణను 70 మీటర్లకు పరిమితం చేయొచ్చని గత నెలలో నిర్ణయించి రూ.16,310 కోట్లు ఖర్చు కాగలదని అంచనా వేసింది. అయితే ఇది ఎంతమాత్రం కుదరదని వెడల్పు ఆది నుంచి అనుకుంటున్న విధంగా 150 మీటర్ల ఉండాల్సిందేనంటూ సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి స్పష్టం చేస్తూ ఇటీవల లేఖ రాశారు. దీంతో 140 మీటర్ల వెడల్పుతో అమరావతి ఓఆర్ఆర్ పేరిట 189.4 కి.మీ.లకు భూసేకరణకు కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వశాఖ ఎట్టకేలకు ఆమోదం తెలిపింది. అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణపై ఏర్పడిన ప్రతిష్టంభన చిట్టచివరికి తొలగిపోవడంతో త్వరలోనే టెండర్లను కేంద్రం ఆహ్వానించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓ వైపు రాజధాని అమరావతి నిర్మాణ పనులు జోరందుకుంటున్న నేపథ్యంలో వాటికి సమాంతరంగా ఔటర్ రింగు రోడ్డు పనులను కూడా ప్రారంభించాలని చంద్రబాబు పట్టుదలగా ఉన్నారు. రాజధాని నిర్మాణ పనులను వచ్చే మూడేళ్లలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఓఆర్ఆర్‌ను కూడా మూడు దశల్లో మొత్తం మూడేళ్లలోపుగా పూర్తి చేసేలా కాలపరిమితి సీఎం చంద్రబాబు నిర్దేశించుకున్నారు. నిజానికి గత నెలలో ఓఆర్ఆర్ తాలూకు భూసేకరణ విషయంలో పడిన పీటముడి వీడడానికి మరింత సమయం పట్టవచ్చునన్న ఊహాగానాలను పటాపంచలు చేస్తూ యుద్ధప్రాతిపదికన 140 మీటర్ల వెడల్పున భూసేకరణ చేసేలా కేంద్రాన్ని రాష్ట్రప్రభుత్వం ఒప్పించగలిగింది.

రూ.20 వేల కోట్లకు పెరగనున్న అంచనా వ్యయం

అమరావతి ఓఆర్ఆర్ ప్రాజెక్టు వ్యయం పెరగనుంది. గతంలో ప్రకటించిన విధంగా రూ.16310 కోట్లకు బదులు మరికొంత పెరిగే అవకాశం కనిపిస్తుంది. గతంలో సివిల్ వర్కుల అంచనా వ్యయాన్ని రూ.12,955 కోట్లుగా నిర్ణయించగా తాజాగా ఓఆర్ఆర్‌కు వెలుపలి వైపు కూడా సర్వీసు రోడ్డును నిర్మించాలని ప్రతిపాదించడంతో వ్యయం మరో రూ.500 కోట్లకుపైగా పెరిగే అవకాశం ఉంది. అలాగే భూసేకరణ వ్యయం దాదాపు రెట్టింపవనున్నది. 70 మీటర్ల వెడల్పుతో ఓఆర్ఆర్ నిర్మాణం చేయాలనుకున్నపుడు 4,220 ఎకరాలు సరిపోతుందని భావించి వ్యయం రూ.2,665 కోట్లుగా (మిగతా 6వ పేజీలో)

చక్రం తిప్పిన చంద్రబాబు



అమరావతి ఓఆర్ఆర్ 70 మీటర్లు.. ఆరు వరుసలతో సరిపోతుంది అని కేంద్రం గత నెలలో నిర్ణయించింది. అయితే భవిష్యత్తులో పది వరసలకు పెంచాల్సి వస్తుందని.. లోపల, వెలుపలి వైపు సర్వీసు రోడ్డు నిర్మాణం జరిగితేనే ఔటర్‌కు బాహ్యంగా ఉన్న ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందని.. ఓఆర్ఆర్ వెంటే సబర్బన్ రైల్వేలైను నిర్మించాలన్న ప్రతిపాదనలు తమ వద్ద ఉన్నాయని సీఎం చంద్రబాబు కేంద్రానికి వివరించారు. ప్రధానంగా పదిలేన్లుగా విస్తరించాల్సి వచ్చినపుడు కొత్తగా భూసేకరణ అంటే ఖర్చు విపరీతంగా పెరుగుతుందని చెప్పారు. దీంతో చంద్రబాబు కోరినట్లు 150 మీటర్లు కాకుండా 140 మీటర్ల వెడల్పుకు ఆమోదం తెలిపింది. మొత్తమ్మీద చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఓఆర్ఆర్ నిర్మాణం జరగనున్నది.

భయాందోళనలొద్దు

- బర్డ్ ఫ్లూ మృతిపై వైద్యఆరోగ్యశాఖ అప్రమత్తం
- బాలయ్యనగర్ ప్రాంతంలో ముందస్తు నివారణ చర్యలు
- 3 వేల మంది నుంచి నమూనాలు సేకరించాం : డీఎంహెచ్‌వో



బాలయ్యనగర్‌లో స్థానికుల నుంచి నమూనాలు సేకరిస్తున్న డాక్టర్

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలయ్యనగర్‌కు చెందిన రెండేళ్ల బాలిక బర్డ్ ఫ్లూ లక్షణాలతో మృతి చెందిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా బాలయ్యనగర్ ప్రాంతంలో బుధవారం విస్తృతంగా నమూనాలు సేకరించింది. ఈ క్రమంలో ఎవరిలోనూ వ్యాధి లక్షణాలను గుర్తించలేదని, అందువల్ల బర్డ్ ఫ్లూపై ఎవరూ భయపడాల్సిన పనిలేదని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తెలిపారు. మృతి చెందిన బాలిక ఇంటి సమీపంలో సుమారు 3000 మందిని పరీక్షించామని, ఎవరికీ ఎటువంటి లక్షణాలు బయటపడలేదన్నారు. వ్యాధి లక్షణాల తీవ్రత ఏడు రోజుల్లో తగ్గిపోతాయన్నారు. బాలిక గత నెల 15న ఆస్పత్రికి వచ్చిందని ఈ నేపథ్యంలో బర్డ్‌ఫ్లూ వ్యాధిపై ఎవరికీ ఎటువంటి అనుమానాలు అవసరం లేదన్నారు. కోడి వ మాంసాన్ని శాస్త్రీయంగా ఉడకబెట్టి నిరభ్యంతరంగా తీసుకోవచ్చన్నారు. పౌల్ట్రీ ఫారాల్లోని కోళ్లను, చికెన్ దుకాణాల్లో విక్రయించే మాంసం తనిఖీలకు చర్యలు తీసుకోవాలని పశు సంవర్థక శాఖ అధికారులను కోరినట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు ఏ పక్షి కూడా బర్డ్ ఫ్లూతో మరణించినట్లు గుర్తించ లేదన్నారు.

అదేవిధంగా కోళ్ల ఫారాల్లో కూడా సదరు వ్యాధి లక్షణాలు గమనించలే దన్నారు. ప్రభుత్వ వైద్యశాల పర్యవేక్షణ అధికారి డాక్టర్ రంగారావు వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలను స్థానికులు సూచించారు.

బకాయిలు


చెల్లించకపోతే తాళాలు

- దుకాణ దారులకు మున్సిపల్ కమిషనర్ హెచ్చరిక
- రూ.80 లక్షల వరకు పేరుకుపోయిన బకాయిలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రూ.80 లక్షల వరకు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి.. ఇప్పటికి 20 నుంచి 30 సార్లు దుకాణదారులకు అద్దెలు చెల్లించాలని నోటీసులు ఇచ్చాం.. ఆర్థిక సంవత్సరం చివరి తేదీ గడువు కూడా ముగిసింది.. అయినా దుకాణదారుల్లో చలనం లేదు.. ఇక ఉపేక్షించేది లేదు.. సత్వరం అద్దెలు చెల్లించకపోతే మున్సిపల్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు తాళాలు వేస్తాం.. అని బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక చంద్రమౌళి కూరగాయల మార్కెట్, గాంధీపార్కు చుట్టూ ఉన్న దుకాణదారులను బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు, రెవెన్యూ ఆఫీసర్ సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ అబ్దుల్‌ఖాదర్ కలసి బకాయిలు తక్షణం చెల్లించాలని కోరారు. బకాయిలు చెల్లించేందుకు మూడు రోజులు గడువు ఇచ్చారు. ఆలోపు చెల్లించని పక్షంలో దుకాణాలకు తాళాలు వేస్తామని తేల్చి చెప్పారు. దుకాణదారులకు ఇప్పటికే చాలా అవకాశాలు ఇచ్చామన్నారు. బకాయిదారులకు లీగల్ నోటీసులు కూడా జారీ చేస్తామని చెప్పారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలను అద్దెకు తీసుకుని దీర్ఘకాలంగా అద్దెలు చెల్లించకుండా వ్యాపారాలు చేసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు.

కందులు.. కష్టాలు

- ధర పతనంతో రైతుల ఆవేదన
- అమ్మకానికి సిద్ధంగా లేని రైతులు



రైతు ఇంట్లో నిల్వ ఉన్న కందుల బస్తాలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడులో రబీ సీజన్‌లో రైతులు విస్తారంగా మాగాణి, మెట్ట భూముల్లో కంది సాగుచేశారు. సాగర్ ఆయకట్టు పరిధిలో బోర్లు, వాగుల కింద పిడుగురాళ్ల సబ్‌డివిజన్ పరిధిలో సుమారు 25 వేల ఎకరాల్లో కందిని సాగుచేశారు. వాతావరణం అనుకూలించడం, తెగుళ్ల తాకిడి తక్కువగా ఉండటంతో ఎకరాకు 12 క్వింటాళ్లకు పైగా దిగుబడి రైతులకు చేతికందింది. కొత్తరకం కంది వంగడాలు మూడు నెలలకే దిగుబడి వచ్చేసింది. కోతలు కూడా పూర్తయ్యాయి. కందులు అమ్మేందుకు రైతులు సిద్ధమ య్యారు. అయితే రైతు భరోసా కేంద్రాలలో ఎకరాకు 8 క్వింటాళ్ల వరకే కొనుగోళ్లకు అనుమతి ఉందని, అదీ ఈ-క్రాప్‌లో నమోదై ఉండాలన్న నిబంధనను మార్క్ ఫెడ్ విధించింది. గత ఏడాది క్వింటా రూ.10500 వరకు ధర పలకగా ప్రస్తుతం రూ.7,550 మద్దతు ధరగా ప్రకటించారు. ఎకరాకు 12 క్వింటాళ్ల వరకు చేతికందితే 8 క్వింటాళ్లకే అనుమతించడం, ఆపై ధర కూడా ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు అమ్మకాలకు సిద్ధంగా లేరు. ఈ పరిస్థితుల్లో రైతుల లోగిళ్లలో కందుల నిల్వలు పేరుకుపోయాయి.

మొత్తం కొనుగోలు చేయాలి

రైతులు సాగు చేసిన పంట మొత్తాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలి. ఎకరాకు 8 క్వింటాళ్లు, ఈ-క్రాప్ నమోదు నిబంధనలను సడలించాలి. నిల్వ ఉన్న కందుల మొత్తాన్ని కొనుగోలు చేస్తేనే రైతులకు మేలు.

- దావులూరి నాగాంజనేయులు

రైల్వే ప్రాజెక్టులపై అనిశ్చితి

- కేటాయింపులపై ఇప్పటికీ అస్పష్టతే
- పనులు ఎలా ముందుకెళ్లాలో తెలియని వైనం
- గతంలో బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు, మూడు రోజుల్లోనే పింక్‌బుక్
- 2 నెలలు గడుస్తున్నా విడుదల చేయని రైల్వేబోర్డు

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): 2025-26 నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమైనప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో గుంటూరు డివిజన్ రైల్వే ప్రాజెక్టులకు జరిగిన కేటాయింపులపై స్పష్టత కొరవడింది. కీలకమైన అమరావతి నూతన రైలుమార్గం, గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్, నడికుడి - శ్రీకాళహస్తి, గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్ ప్రాజెక్టులకు ఏ మేరకు నిధులు కేటాయించారనేది తెలియకుండా ఉన్నది. రైల్వే అధికారులకు అంతర్గతంగానూ ఆ వివరాలను నేటివరకు రైల్వేబోర్డు పంపించలేదు. గతంలో పబ్లిక్ డొమైన్‌లో అన్ని వివరాలను ఉంచే రైల్వే బోర్డు ఈ ఏడాది ఎందుకు అంత గోప్యత పాటిస్తుందో ఎవరికి అంతు చిక్కకుండా ఉన్నది. దీనిపై ఇప్పటికే జెడ్‌ఆర్‌యూసీసీ, డీఆర్‌యూసీసీల సభ్యులు రైల్వేబోర్డుకు లేఖలు పంపారు.

కేంద్ర బడ్జెట్‌ని ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీనే ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టారు. గతంలో బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు, మూడు రోజుల వ్యవధిలో రైల్వేకి సంబంధించి అన్ని ప్రాజెక్టులు, వర్కులకు కేటాయించిన నిధుల వివరాలతో పింక్‌బుక్ విడుదలయ్యేది. ఇది ఇండియన్‌రైల్వేస్ వెబ్ పోర్టల్‌లో అందరికి అందుబాటులో ఉంచేవారు. దాంతో డివిజన్‌కి ఎంత మొత్తంలో నిధులు విడుదలయ్యాయనేది తెలిసిపోయేది. దాంతో ఆయా ప్రాజెక్టులు ఎప్పటిలోపు పూర్తి అవుతాయనే విషయంపై ఒక అంచనాకు వచ్చేవాళ్లు. గత ఏడాది నెల ఆలస్యమైనా పింక్‌బుక్‌ని రైల్వే శాఖ విడుదల చేసింది. ఈ సంవత్సరం ఏ కారణంతోనో రెండు నెలలైనా ఆ ఊసే లేకుండా పోయింది.

- గుంటూరు డివిజన్‌కి సంబంధించి నడికుడి - శ్రీకాళహస్తి(309 కిలోమటర్ల) రైలు మార్గం పనులను రైల్వే శాఖ రూ. 2650 కోట్లతో చేపట్టింది. ఇందులో దాదాపుగా రూ. 1300 కోట్ల విలువ చేసే పనులు పూర్తి అయ్యాయి. గత ఏడాది రూ. 450 కోట్లు మంజూరయ్యాయి. ఇవి ఏమేరకు ఖర్చు చేశారనేది 2024-25 రివైజ్డ్ అవుట్‌లేలో చూపిస్తారు. అలానే 2025-26కి ఎంత కేటాయింపులు చేశారనేది ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అవుట్‌లేలో చూపిస్తారు. అలాంటిది ఆ వివరాలు ఏవీ తెలియని పరిస్థితి నెలకొన్నది.
- విజయవాడ - గుంటూరు వయా అమరావతి(106) కిలోమీటర్ల నూతన రైలు మార్గం పనులను రూ. 2679.59 కోట్లతో రైల్వే శాఖ మంజూరు చేసింది. వైసీపీ హయాంలో ఈ ప్రాజెక్టుకి రూపాయి కూడా కేటాయింపు జరగలేదు. గత ఏడాది కేంద్రంలో ఎన్‌డీటీ కూటమి ఏర్పడటం, అందులో టీడీపీ, జనసేన భాగాస్వామ్యం కావడంతో దీనిని ముందుకు తీసుకెళ్లేందుకు రూ. 50 కోట్లు కేటాయించింది. దాంతో భూసేకరణ ప్రక్రియని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ ఏడాది ప్రాజెక్టుని గ్రౌండింగ్ చేసేందుకు ఎంత మేరకు నిధులు ఇచ్చారో తెలియకుండా ఉన్నది.
- గుంతకల్లు - గుంటూరు డబ్లింగ్(401.47 కిలోమీటర్లు)కు గత ఏడాది రూ. 480 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 3269 కోట్లు కాగా ఇప్పటివరకు రూ. 2,918 కోట్లు ఖర్చు చేశారు. ఈ ప్రాజెక్టు చివరి దశకు చేరుకొన్న నేపథ్యంలో నిధులు విడుదల ఎంతో అవసరం. ఆ వివరాలు నేటివరకు డివిజన్‌కి కూడా అందని పరిస్థితి.
- గుంటూరు-బీబీనగర్ డబ్లింగ్‌కి రూ.2,853.23 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. గతేడాది రూ. 220 కోట్లు మంజూరయ్యాయి. దాంతో పలు సెక్షన్లలో పనులు ప్రారంభమయ్యాయి. వాటిని వేగవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు నిధులు ఎక్కువ మొత్తంలో అవసరం. ఈ ఏడాది ఎంత కేటాయించారో తెలియడం లేదు.
- రైలు మార్గాలే కాకుండా డివిజన్‌లో లెవల్ క్రాసింగ్ గేట్లు తొలగించేందుకు పలు సెక్షన్లలో ఆర్‌వోబీ/ఆర్‌యూబీలను రైల్వే శాఖ గతంలోనే మంజూరు చేసింది. వాటి పనులు మొదలు కావాలంటే బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తప్పనిసరి. ఈ సంవత్సరం ఎన్ని ఆర్‌వోబీ/ఆర్‌యూబీలు పూర్తి చేసేందుకు నిధులు విడుదల జరిగిందో స్పష్టత లేకుండా ఉన్నది.

ఆరు పళ్ల విభాగంలో కోదాడ ఎడ్లకు ప్రథమ స్థానం

బెల్లంకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందిపాడు గ్రామంలో వెంకటేశ్వర స్వామి తిరునాళ్ల సందర్భంగా నిర్వహించిన ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల పశు బల ప్రదర్శనలో ఆరు పళ్ల విభాగంలో తెలంగాణా రాష్ట్ర సూర్యాపేట మండలం కోదాడ గ్రామానికి చెందిన నలమాద ఉత్తమ్ పద్మావతిరెడ్డి ఎడ్ల జత 4400 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం సాధించింది. నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన మేకా అంజిరెడ్డి ఎడ్ల జత 4000 అడుగుల దూరం లాగి రెండోస్థానం, ప్రకాశం జిల్లా కనిగిరి మండలానికి చెందిన సానికొమ్ము శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 3,389 అడుగుల దూరం లాగి మూడో స్థానం, తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట మండలం కోదాడ గ్రామానికి చెందిన నలమాద ఉత్తమ్ పద్మావతి రెడ్డి ఎడ్ల జత 3,286 అడుగులు లాగి నాల్గో స్థానం, అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామానికి చెందిన చావం హేమత్ సాయి రామ్‌కు చెందిన ఎడ్ల జత 3,219.7 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన జీ లక్ష్మీ వివేక్‌కు చెందిన ఎడ్ల జత 3,131.7 అడుగుల దూరం లాగి ఆరో స్థానం సాధించాయి. ఆరు పళ్ళ విభాగంలో మొత్తం పది ఎడ్ల జతలు ప్రదర్శనలో పాల్గొన్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బండి పల్లెకొండ, శ్రీహరిరావు, వెంకట నరసయ్య, గ్రామస్తులు పర్యవేక్షించారు.

నేడు రాజధాని రైతులకు ప్లాట్ల కేటాయింపు

తుళ్లూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ కొనసాగుతుంది. గురువారం విజయవాడ లెనిన్ సెంటర్ నందు గల సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో 15 గ్రామాలకు చెందిన రైతులకు ప్లాట్లు కేటాయించనున్నారు. 194 మంది రైతులకు 502 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ-లాటరీ జరగనుందని సీఆర్డీఏ కార్యాలయం వర్గాలు బుధవారం తెలిపాయి. నవులూరు 1, 2 యూనిట్‌లకు, కురగల్లు 1, 2, నిడమర్రు 1, 2, పెనుమాక, నెక్కల్లు, అనంతవరం గ్రామాలకు సంబంధించిన రైతులు ఈ- లాటరీకి హాజరుకావాలని తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాయపూడి 1, 2. వెంకటపాలెం, వెలగపూడి, మందడం 1, 2, దొండపాడు, పిచుకలపాలెం, ఐనవోలు, లింగాయపాలెం,ఉద్దండ్రాయునిపాలెం గ్రామాలకు సంబంధించిన రైతులు ఈ-లాటరీకి హాజరుకావాలని అధికారులు కోరారు.

సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు పునఃప్రారంభం

మంగళగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో అతిప్రధానమైన సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు పునఃప్రారంభమయ్యాయి. రాజధాని అమరావతిలో సీడ్‌యాక్సెస్ రోడ్డును దొండపాడు నుంచి మణిపాల్ ఆస్పత్రి వద్ద కనకదుర్గా వారధి వరకు జాతీయ రహదారి-16ను అనుసంధానించేలా ఈ-3 రోడ్డు పేరిట ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ రోడ్డు నిర్మాణ పనులను రెండు దశలుగా చేపట్టారు. దొండపాడు నుంచి ఉండవల్లి వరకు ఒకదశగాను, ఉండవల్లి నుంచి కనకదుర్గావారధి వరకు రెండో దశగాను నిర్మించాలని ప్రతిపాదించి 2017-18 పీరియడ్‌లో వెంకటపాలెం వరకు దీనిని నిర్మించారు. అయితే తొలిదశ పనుల్లో అటూఇటూ కొంతమేర పనులు జరుగలేదు. ఈ తొలిదశ పనులకు సంబంధించి రాయపూడి జంక్షన్ నుంచి ఓ అరకిలోమీటరు దూరం వరకు దొండపాడు వైపు మధ్యలో నిలిచిపోయిన నిర్మాణ పనులను మంగళవారం నుంచి పునఃప్రారంభించారు. దీంతోపాటు రెండోదశ తాలూకు పనులను కూడా ఆరంభిస్తారని తెలుస్తోంది. ఈ మొత్తం పనులను ఎన్‌సీసీ కంపెనీ రూ.188 కోట్లకు దక్కించుకున్నట్టు తెలిసింది.


రాయపూడి వద్ద పునఃప్రారంభమైన సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు

రాజసానికి పెట్టింది పేరు ఒంగోలు జాతి ఎద్దులు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

తెనాలి రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జాతి ఎద్దులంటేనే రాజసానికి, పౌరుషానికి పెట్టింది పేరని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన, పశుపాల పోటీలకు ఐదో రోజు బుధవారం మంత్రి సవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి సవిత మాట్లాడుతూ తెనాలిలో జాతీయ స్థాయి ఎడ్లబల ప్రదర్శనతో పండుగ వాతావరణం సంతరించుకుందన్నారు. పోటీలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే నక్కాఆనంద బాబు, కమిటీ సభ్యుల సహకారంతో ఎనిమిది సంవత్సరాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల భావితరాల్లో ఒంగోలు జాతి ఎడ్లపై మమకారం పెరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల కోసం కొత్త స్కీం తీసుకురాబోతున్నారని, పాడి రైతులను ప్రోత్సహించేలా డైరీ ఫామ్స్ పెట్టుకునేలా 50శాతం సబ్సిడీతో లోన్లు ఇచ్చి అంతరించిపోతున్న పాడి పరిశ్రమను తిరిగి నిలబెట్టుకునేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు కుమారుడు గద్దె క్రాంతికిరణ్, స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ముస్తాక్ అహ్మద్ పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరై దివంగత ఎన్టీఆర్, ఆలపాటి శివరామకృష్ణయ్యల విగ్రహాలకు ముందుగా నివాళులర్పించి కార్యక్రమాలను ప్రారంభించారు.


సభలో మాట్లాడుతున్న మంత్రి సవిత, చిత్రంలో ఎమ్మెల్సీ ఆలపాటి, ఎమ్మెల్యేలు ఆనందబాబు, పుల్లారావు

సేద్యం విభాగంలో పెదగొట్టిపాడు ఎడ్లజత ప్రథమం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆలపాటి వెంకట్రామయ్య స్మారక ఎడ్ల బల ప్రదర్శనలో పెదగొట్టిపాడు ఎడ్లు ప్రథమ స్థానం సాధించాయి. తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న ఎడ్ల ప్రదర్శనలో బుధవారం గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్ల జత 5100 అడుగులు దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా ఉయ్యందన గ్రామానికి చెందిన రైతు వీరబ్రహ్మనాయుడు ఎడ్ల జత 4854 అడుగులు దూరం లాగి ద్వితీయ స్థానం, వేటపాలెంకు చెందిన రైతులు శివకృష్ణ చౌదరి, శిరీష చౌదరీల ఎడ్లజత 4807అడుగుల దూరం లాగి తృతీయ స్థానం సాధించాయి. 4,5,6,7,8,9 స్థానాల్లో వరుసగా కొప్పురావూరు రైతు తోట శ్రీనివాసరావు ఎడ్ల జత 4734 అడుగుల దూరం, సరిపూడి రైతు పవన్‌కుమార్ చౌదరి ఎడ్ల జత 4449అడుగులు, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ రైతు సప్రాస యాదవ్ ఎడ్లజత 4395 అడుగులు, పెదగొట్టిపాడు రైతు లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 4202 అడుగులు, మాచవరం రైతు యామినిమోహన ఎడ్లజత 3935అడుగులు, కృష్ణా జిల్లా చినపులిపాక రైతు ఎడ్లజత 3600అడుగులు లాగాయి. విజేతలకు 1వ స్థానం నుంచి 9వ స్థానం వరకు దాతలు మైనేని రత్నప్రసాద్, మాదినేని హరికృష్ణలు రూ.60,000, విజయసారధి రూ.50,000, గౌతమ్ గ్రాండ్ రూ.40,000, కాట్రగడ్డ వెంకటేశ్వరరావు రూ.35,000, మద్రాసు సాంబశివరావు రూ.30,000, కనకమేడల మురళి రూ.25,000, ఈడ్పుగంటి వరప్రసాద్, కొత్తపల్లి శ్రీనివాసరావు రూ.15,000, కేసినేని జయదేవ్ రూ.10,000 బహుమతులు అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పలువురు టీడీపీ నాయకులు పోటీలను పర్యవేక్షించారు.


సేద్యం విభాగంలో ప్రథమ స్థానం సాధించిన పెదగొట్టిపాడు ఎడ్ల జత

డ్రైవర్ నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు



తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బస్సును నిర్లక్షంగా నడిపి వ్యక్తి మృతికి కారణమైన ఆర్‌టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల 31వ తేదీన ఆర్‌టీసీ బస్టాండ్ రోడ్డులో నడచి వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని విజయవాడ నుంచి తెనాలి డిపోకి వస్తున్న బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతి వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. స్థానికులు గాయపడిన వ్యక్తిని జిల్లా వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు. బుధవారం 36వ వార్డు వీఆర్‌వో బీ రత్నకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 38 సంవత్సరాలు ఉంటాయని బ్లూజీన్స్ ప్యాంటు, ఆఫ్ చేతులు చొక్కా ధరించి ఉన్నాడని ఆచూకీ తెలిసిన వారు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

బయట పడిన హత్యాయత్నం ప్రణాళిక ఆడియో

- ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

నూజెండ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : హత్యాయత్నం చేసిన పథక రచన ఆడియో బయట పడటంతో ఐనవోలులో బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బీవీ కృష్ణారావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని అల్లిబాయి పాలెం గ్రామానికి చెందిన కర్నాటి వెంకటరావు, అదే గ్రామానికి చెందిన మీరావలికి గతంలో నగదు అప్పుగా ఇచ్చి ఉన్నాడు. ఈ విషయమై జరిగిన లావాదేవీల్లో మీరావలి తన తమ్ముడు లాలయ్యతో కలసి హత్యాయత్నం పథకం గురించి ఫోన్‌లో చర్చించిన ఆడియో బహిర్గతం కావటంతో బాధితుడు వెంకటరావు ఫిర్యాదు మేరకు మీరావలి, లాలయ్యలపై కేసు నమోదు చేశామన్నారు.

70 కాదు.. 140 మీటర్లు

(5వ పేజీ తరువాయి)

అంచనా వేశారు. ఇపుడు అది 140 మీటర్లకు చేరుకోవడంతో వ్యయం రూ.5 వేల కోట్లను మించే అవకాశంఉంది. మొత్తం ఓఆర్‌ఆర్ అంచనా రూ.20 వేల కోట్లు అవనున్నది.

ఓఆర్‌ఆర్‌తో పాటే ఐఆర్‌ఆర్ కూడా..

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఓఆర్‌ఆర్‌తో సంతృప్తి చెందకుండా ముందు ప్రతిపాదించిన విధంగా అంతర వలయ రహదారి(ఐఆర్‌ఆర్) నిర్మాణంపై కూడా దృష్టి పెట్టింది. ఓఆర్‌ఆర్ నిర్మాణ వ్యయం భరించనున్న నేపథ్యంలో ఐఆర్‌ఆర్‌ను పక్కన పెట్టాలని కేంద్రం దాదాపుగా రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఐఆర్‌ఆర్ విషయమై ఇంకా కేంద్రంతో సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ఐఆర్‌ఆర్ నిర్మాణానికి ముందుకురాని పక్షంలో పీపీపీ విధానంలో అయినా నిర్మించి తీరాలన్న కృతనిశ్చయంతో చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తుంది.

అనుమతుల్లేని లే అవుట్లపై చర్యలు

- రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ సునీత

వినుకొండటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని లే అవుట్లపై చర్యలు తీసుకుంటామని రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ బీ సునీత తెలిపారు. పట్టణంలోని అరుణ హాల్ ఎదురుగా ఉన్న ఏబీఎం కాంపౌండ్ ఆవరణలో అక్రమంగా నిర్మిస్తున్న 3 అంతస్తుల భవనాన్ని సునీత బుధవారం పరిశీలిం చారు. దారా వెంకట శేషమ్మ అక్రమంగా నిర్మిస్తున్న 3 అంతస్తుల బిల్డింగ్‌పై గత నెల 17వ తేదీన కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్‌ఎస్‌కు గోళ్ల హిమ బిందుప్రియ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు నూతనంగా నిర్మిస్తున్న భవనం తనిఖీకి వచ్చినట్లు సునీత తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కారంపూడి రోడ్డు తారకరామ నగర్‌లోని అపార్ట్‌మెంట్లతో పాటు అదే రహదారిలోని ఆదిత్య స్కూల్ సమీపంలో నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సునీత మాట్లాడుతూ 2023 సంవత్సరంలో అపార్ట్‌మెంట్‌లకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో పూర్తి చేసి నివాస యోగ్యానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో పరిశీలించడం జరిగిందని తెలిపారు. వినుకొండ పరిసర ప్రాంతాల్లో అక్రమ లే అవుట్లపై ప్రశ్నించగా త్వరలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయ ఆవరణ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా 5 అడుగుల స్థలాన్ని మున్సిపాలిటీకి రిజిస్ట్రేషన్ చేయాలని, లేనిపక్షంలో బిల్డింగ్ నిర్మాణాలకు అనుమతులు నిరాకరించడం జరుగుతుందన్నారు. 2019 జూన్ 30 నాటి అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ఐపీఎల్‌పీ అయి ఉండి ప్రపోషనేట్ ఓపెన్ స్పేస్ చార్జీలతో పాటు 33.3 శాతం పీనలైజేషన్ చార్జీలు చెల్లించినట్లయితే అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు. వినుకొండ పాత పట్టణంలో కనీసం 10 అడుగులు రోడ్డు ఉన్న ప్రాంతంలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఏ (జిల్లా ప్లానింగ్ అధికారి) పూర్ణచంద్రారెడ్డి, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వెంకట్రావమ్మ తదితరులు పాల్గొన్నారు.


కారంపూడి రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న సునీత

కుమార్తె మరణాన్ని తట్టుకోలేక తల్లి ఆత్మహత్య


రజని (ఫైల్‌ఫొటో)

మాచర్లటౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కుమార్తె అకాల మరణంతో మనస్తాపం చెంది తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచర్ల పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణంలోని మండాది రోడ్డులో గల విశ్వబ్రాహ్మణ కాలనీలో తాళ్లూరి శ్రీనివాసాచారి, రజని (37) దంపతులు నివాసం ఉంటున్నారు. ద్వితీయ కుమార్తె అఖిల ఇటీవల ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుమార్తె అకాల మరణాన్ని జీర్ణించుకోలేక తల్లి రజని బుధవారం మధ్యాహ్నం భర్త పనులపై బయటకు వెళ్లగా పెద్ద కుమార్తె రమ్య వాష్‌రూంకు వెళ్లింది. ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పక్కింటి మహిళ రమణ చూసి కేకలు వేయగా వాష్‌రూంలో ఉన్న పెద్ద కుమార్తె రమ్య బయటకు వచ్చేసరికి అప్పటికే రజని ప్రాణాప్రాయ స్థితిలో ఉంది. స్థానికులు రజనీని ప్రభుత్వాస్పత్రికి తరలించగా డాక్టర్లు చనిపోయినట్లు ధ్రువీకరించారు. పట్టణ సీఐ ప్రభాకరరావు, ఎస్ఐ సంధ్యారాణిలు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని వివరాలు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూల్యాంకన కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు

గుంటూరు (విద్య) ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకనం గురువారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ హైమారావు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆర్‌జేడీ బీ లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. జోన్ - 3 పరిధిలోని గుంటూరు,పల్నాడు, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో మూల్యాంకన కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు కె. సాంబశివ రావు, గుంటూరు జిల్లా అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఖలీల్, గుంటూరు నగర శాఖ అధ్యక్షులు పీ సాయి విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శి పి లలిత బాబు, జిల్లా నాయకులు ఏవీ కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ నాయకులు

రైల్వేలో గ్రూప్ డీ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖలో గ్రూప్ డీ ఉద్యోగాల కోసం అవసరమైన శిక్షణను రామ్‌కీ ఫౌండేషన్, పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ ల్యాండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా అందించనున్నట్లు ఆయా సంస్థల ప్రతినిధులు ఎంవీ రామిరెడ్డి, గద్దె భాస్కర్, ప్రొఫెసర్ లక్ష్మీ కుమారిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీన రెండు రాష్ట్రాల్లోని వివిధ నగరాలలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నామని, విజయం సాధించిన అభ్యర్థులకు శ్రీధర్ సీసీఎఫ్ సంస్థ నేతృత్వంలో మూడు నాలుగు నెలల పాటు హైదరాబాదులో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. అభ్యర్థులకు శిక్షణతో పాటు వసతి, భోజనం, స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, కర్నూల్ నగరాల్లో పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 9866 777 870 నంబర్‌లో సంప్రదించాలని ఎంవీ రామిరెడ్డి కోరారు.

గుంటూరు మీదగా చర్లపల్లి - విశాఖపట్టణం రైలు

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 3వ తేదీ గురువారం గుంటూరు మీదగా చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలుని నడపనున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07011 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు గురువారం రాత్రి 8.15కి బయలుదేరి 10.43కి నడికుడి, 11.13కి పిడుగురాళ్ల, 11.43కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.30కి గుంటూరు, శుక్రవారం ఉదయం 9.30కి విశాఖపట్టణం చేరుకొంటుందన్నారు. విశాఖపట్టణం వెళ్లే ప్రయాణీకులు ఈ ప్రత్యేక రైలు సదుపాయాన్ని వినియోగించుకోవాలని డీఆర్‌ఎం విజ్ఞప్తి చేశారు.

పారదర్శకంగా నాణ్యమైన పరికరాల పంపిణీ

- ఏపీ ఆగ్రోస్ కార్యాలయం
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

గుంటూరు సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన వ్యవసాయ పరికరాలను ఎఫ్‌ఎం-యాప్ ద్వారా పారదర్శకంగా పంపిణీ చేశామని ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 'కొటేషన్లతో కొట్టేశారు...... సబ్సిడీ యంత్రాల్లో కమీషన్ల మోత' అనే శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి కార్యాలయ వర్గాలు స్పందించాయి. ఈ ఏడాది రైతులకు పంపిణీ చేసిన సబ్సిడీ వ్యవసాయ యంత్రాల ధరలు 2022 తో పోలిస్తే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొటేషన్ పద్ధతిలో వ్యవసాయ యంత్రాల ధరలు నిర్ణయించ లేదని, కమిటీ ఆధ్వర్యంలో పారదర్శకంగా ధరలను నిర్ణయించడం జరిగిందన్నారు. మార్కెటులో డీలర్లు రైతులకు బిల్లులు ఇవ్వకుండా, వారంటీలేని పరికరాలను ఇవ్వడం అనవాయి తీగా జరుగుతుందని అన్నాయి. సబ్సిడీ ద్వారా పంపిణీ చేసే పరికరాలకు తప్పకుండా జీఎస్టీ బిల్లు ఇవ్వాలని, తద్వారా 12 శాతం పన్ను వసూలు చేయటం తోపాటు, 2 శాతం ఏపీ ఆగ్రోస్‌కు చెల్లించాల్సి రావటం వల్ల ధరల్లో వ్యత్యాసం ఉన్నట్లు పేర్కొన్నాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 518.40 అడుగులు ఉంది. ఇది 146.37 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6248 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 7913 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 7913 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 20,311 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 3598 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

1,28,132 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,30,848 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,28,132 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 56,061 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13000
నంబరు. 5	10000	13400
273	10000	12900
341	10500	14000
4884	10000	11900
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10300	13600

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
షార్క్-1	10500	12400
బ్యాడిగి 355	10000	13200
సింజెంటా		
బ్యాడిగి 5531	10500	12200
దేవనూరు డీలక్స్	10300	12700
ఆర్మూరు	10000	11300
తాలుకాయలు	4500	6500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

మాచర్లటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అమరరాజా కంపెనీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాలో నిరుద్యోగ యువత పాల్గొని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ కనీస విద్యార్హతలు అన్నారు. ఎంపికైనవారికి స్టైఫండ్ కింద రూ.12వేల నుంచి రూ.15వేలతో పాటు భోజనవసతి ఉంటుందన్నారు. ట్రైనింగ్ పూర్తయ్యాక నెలకు రూ.22వేల జీతం ఇస్తారన్నారు.

నేటి నుంచి ఆధార్ నమోదు క్యాంపులు

మాచవరం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 3వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రెండు విడతలుగా ఆధార్‌క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంగళరావు బుధవారం తెలిపారు. 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మొదటి విడతగా, 8వ తేదీ నుంచి 11వరకు రెండో విడతగా మోర్జంపాడు, మాచవరం సచివాలయాల్లో ఆధార్ నమోదుకేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగపరుచుకోవాలన్నారు. ముఖ్యంగా ఆరేళ్ల వయసుగల పిల్లలకు ఆధార్ నమోదు చేయించుకోవాలని కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు అర్జీలు పెట్టుకోండి

ఈనెల 11వ తేదీ నుంచి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో అర్జీలు పెట్టుకోవాలని ఎంపీడీవో వెంగళరావు బుధవారం తెలిపారు. అర్హులైనవారు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా అర్జీలు సమర్పించు కోవాలని తెలిపారు.

నాగులగుడిలో ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నాగుల గుడి దేవాలయంలో వసంత నవరాత్రుల మహోత్సవం సందర్భంగా బుధవారం అమ్మవారిని పెన్నులు, పుస్తకాలతో విశేష అలంకరణ గావించారు. సాయంత్రం పంచహారతులు, మంత్రపుష్పం కార్యక్రమాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. దేవస్థానకమిటీ అధ్యక్షుడు గుడె నాగసతీష్ పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే యరపతినేని రాక

ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు గురువారం పిడుగురాళ్లలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు పాండురంగ శ్రీను బుధవారం తెలిపారు. జానపాడు రోడ్డు ఫ్లైఓవర్ నిర్మాణంపై అధికారులతో సమీక్షిస్తారన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

దాచేపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని నడికూడి గ్రామంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నీటి తొట్ల నిర్మాణపనులకు భూమిపూజ

అచ్చంపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నీటితొట్ల నిర్మాణానికి పశుసంవర్థక శాఖ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. మండలంలో మొత్తం 12 పశువుల నీటితొట్లను నిర్మించనున్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ పీ స్వాతిదేవి, వేల్పూరు గ్రామ సర్పంచ్ జువ్వా శంకర్, అధికారులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 30.10 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300క్యూసెక్కులు దిగువకు విడుదలవుతుంది.

విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండాలి

క్రోసూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక వికాసం, నైతిక విలువలు కలిగి ఉండాలని క్రోసూరు ఎంఈవో ఏకుల ప్రసాదరావు అన్నారు. క్రోసూరులోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో బుధవారం విద్యార్థుల గ్రాడ్యుయేషన్ సెలబ్రేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఎంఈవో ప్రసాదరావుతో పాటు మరో ఎంఈవో గణేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంఈవో గణేష్ మాట్లాడుతూ విద్యార్థులందరూ లక్ష్యాలను నిర్దేశించుకొని విద్యను అభ్యసించాలన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణతో ఉప కులాలకు మేలు

రెంటచింతల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ ద్వారా ఉపకులాలకు మేలు చేకూరుతుందని తద్వారా సామాజిక న్యాయం సాకారం అవుతుందని జిల్లా ఎమ్మార్పీఎస్ నేత జి.శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వర్గీకరణకు పూర్తి సహకారం అందించిన సీఎం చంద్రబాబుతో పాటు కూటమి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్ అందజేత

గురజాలటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడుగులలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం గురజాలకు చెందిన నారాయణ ఎడ్యుకేషన్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు లేళ్ల కృష్ణ ఆధ్వర్యాన స్పోర్ట్స్ డ్రస్ అందించారు. కార్యక్రమంలో ఎంఈవో సాంబశివరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, హుస్సేన్, పెద్దబాబు, సీమోను, కోటి, నాగేశ్వరరావు నాయక్, యాగంటి రామారావు, ఉల్లి నారాయణ, వాణి తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన కావటి

సత్తెనపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు మాజీ మేయర్ కావటి మనోహర్‌నాయుడు బుధవారం పట్టణంలోని 1వ అదనపు సివిల్ జడ్జి కోర్టుకు హాజరయ్యారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ ఎయిర్‌పోర్టులో జరిగిన దాడికి నిరసనగా క్రోసూరులో చేసిన ధర్నాపై అప్పటి టీడీపీ ప్రభుత్వం కావటి మనోహర్‌నాయుడుపై కేసు నమోదు చేసింది. ఆ కేసులో ఆయన కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి విచారణ నిమిత్తం కేసును వాయిదా వేసినట్టు మనోహర్‌నాయుడు తరుపు న్యాయవాది మర్రి సుబ్బారెడ్డి విలేకరులకు తెలిపారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న చైర్మన్ నరసింహారావు

మున్సిపల్ చైర్మన్ వార్డుల్లో పర్యటన

మాచర్ల రూరల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 26, 27 వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు బుధవారం పర్యటించారు. వార్డుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మునగోడు ఎద్దువాగుపై వంతెన నిర్మించరూ..!



ఎద్దువాగుపై ఉన్న లోలెవెల్ చప్టా

అమరావతి, మార్చి 2(ఆంధ్రజ్యోతి) మండలంలోని మునగోడు గ్రామంలో కృష్ణానదికి వెళ్లే దారిలో ఉన్న ఎద్దువాగుపై హైలెవల్ వంతెన నిర్మించాలని స్థానిక రైతులు కోరుతున్నారు. వాగు వద్ద నుండి కృష్ణానదికి మధ్యలో 700 ఎకరాలలో వివిధ వాణిజ్య పంటలు సాగు అవుతున్నాయి.రైతులు వాగుపై సిమెంట్ తూములు వేసి వాటి మీదుగా పొలాలకు రాకపోకలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం వాహనాలు తిరగాలంటే భయం భయంగా వెళ్లాల్సి వస్తుంది. గతంలో గేదలు వాగుదాటుతూ కొట్టికుపోయిన సంఘటనలు ఉన్నాయి. వాగుకు సంవత్సరానికి రెండు మూడు దఫాలు వరదలు రావడంతో ఉన్న చప్టామీదుగా వెళ్లలేని పరిస్థితి. ఎందరు ప్రజాప్రతినిధులు మారుతున్నా హైలెవల్ వంతెన నిర్మాణం కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ స్పందించి హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి నిర్మించేలా కృషి చేయాలని మునగోడు గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



ప్రజాదర్బార్‌లో వినతులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజల సమస్యలను తెలుసుకొని సత్వరం పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. నియోజక వర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చినవారి నుంచి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. అర్జీలపై సదరు శాఖల అధికారులతో కన్నా మాట్లాడారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని అధికారులకు కన్నా సూచించారు. వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా పశువులకు నీటితొట్లు, సేద్యపు నీటికుంటలు ఏర్పాటుచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఈనెల 3వ తేదీ పట్టణంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ప్రారంభిస్తారని టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి నూర్ బాషాజానీ బాబు బుధవారం విలేకరులకు తెలిపారు.



ప్రజలు ఇచ్చిన అర్జీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

గత ప్రభుత్వ అవకతవకల వల్లే
రెవెన్యూ సమస్యలు అధికం

పెదకూరపాడు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ రీసర్వేలో అవకతవకల వల్లే రెవెన్యూ సమస్యలు అధికంగా వస్తున్నాయని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించి పరిష్కారానికి అధికారులతో అప్పటికప్పుడే మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 8వ తేదీ ఇన్‌చార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్, జేసీ, ఆర్డీవో తదితర అధికారులతో సదస్సులు పెట్టి నియోజకవర్గ అధికారులందరికీ దిశ, నిర్దేశం చేస్తామన్నారు.

● పెదకూరపాడులో జనచైతన్య సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద ఏర్పాటుచేసిన నిమ్మరస పంపిణీని ఎమ్మెల్యే ప్రవీణ్ బుధవారం పంపిణీ చేశారు. గుడిపూడి కాంతారావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు దీనిని ఏర్పాటుచేశారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, నందిగామ ఆశీర్వాదం, సర్పంచ్ గుడిపూడి రాజు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబురావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు వడ్లమూడి అప్పారావు, టీడీపీ మండల నేతలు ఏటుకూరి రత్నకుమార్, షేక్ ముంతాజ్, మక్కెన సాగర్, తహసీల్దార్ నీలి ధనలక్ష్మి, ఎంపీడీవో సోమయాజులు, వివిధ శాఖల అధికారులు, అర్తిమళ్ళ శ్రీనివాసరావు, వాసిరెడ్డి అనీల్‌కుమార్, సమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు, కో-ఆర్డినేటర్ వెలితోటి అనీల్‌కుమార్, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏరియా వైద్యశాలలో కాయకల్ప బృందం పరిశీలన



ఎన్‌బీఎస్ యూనిట్‌ను పరిశీలించిన రాష్ట్ర కాయకల్ప బృంద సభ్యులు డాక్టర్ సుదర్శన్, డాక్టర్ జనార్ధన్

సత్తెనపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ఏరియా వైద్యశాలను రాష్ట్ర కాయకల్ప బృందం సభ్యులు డాక్టర్ జనార్ధన్, డాక్టర్ సురేష్ చంద్‌లు బుధవారం పరిశీలించారు. ఏరియా వైద్యశాలలోని ల్యాబ్, నవజాత శిశువుల స్థిరీకరణ యూనిట్, ప్రసవాలు, బాలింతల వార్డు వంటివాటిని పరిశీలించారు. ఆయా వార్డుల్లో శుభ్రత, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. వ్యర్థాల నిర్వహణ, వార్డుల్లో ప్రజలకు అందిస్తున్న సౌకర్యాల నాణ్యతా ప్రమాణాలు గుర్తించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, గైనకాలజిస్టు డాక్టర్లు, సుజాత, అరుణ, ఆర్‌ఎంవో శోభారాణిలు పలు ఆరోగ్య అంశాలను, గైనిక్ వార్డులో అమలుచేస్తున్న పద్ధతులను వారికి వివరించారు. వారితో పాటు నర్సింగ్ సూపరింటెండెంట్ రాధా, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ తేజ, డాక్టర్ గిరి, హెడ్ నర్సులు వెంకటేశ్వరమ్మ, మరియమ్మ, స్టాఫ్‌నర్సులు ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి

భూముల రీసర్వేతో సమస్యల పరిష్కారం

● ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి

క్రోసూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేతో గ్రామాల్లో ఎన్నో దశాబ్దాలుగా ఉన్న భూసమస్యల పరిష్కారమవుతాయని సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణాకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని 88 తాళ్ళూరులో బుధవారం నిర్వహించిన రీసర్వే అవగాహన కార్యక్రమంలో ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. భూసర్వే జరిగే రోజు రైతులందరూ దగ్గరుండి తమ భూములను సర్వే చేయించుకోవాలని కోరారు. రైతులతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. ఎన్నో ఏళ్ళ నుంచి భూసర్వే లేక రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు, డీటీ శ్రీనివాసరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, మాజీ జెడ్పీటీసీ జీ బాలరామకృష్ణంరాజు, సర్పంచ్ ఏస మ్మ పాల్గొన్నారు. తొలుత అందుకూరు గ్రామంలో భూసర్వే చేసిన రైతుల రికార్డులను పరిశీలించారు. గ్రామంలో ఎండీయూ వాహనాలను పరిశీలించి రేషన్ సక్రమంగా అందుతుందా? లేదా? అని ప్రజలను విచారించారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిద్దాం

టీడీపీ మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి



ప్రకృతి వ్యవసాయం గురించి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బెల్లంకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగుచేస్తూ అంతర పంటలను వేయటం ద్వారా రైతన్నలకు ఆదాయంతో పాటు భూమికి కావాల్సిన సూక్ష్మ పోషకాలు వృద్ధి చెంది భూమి సారవంతగా ఉంటుందని టీడీపీ మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం బెల్లంకొండ మండంలోని నాగిరెడ్డిపాలెం, పాపాయపాలెం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ విధానంపై గ్రామసభలు, ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజ్ మాట్లాడుతూ గ్రామంలోని మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయం ముందుకు తీసుకువెళ్ళేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఎస్‌పి సైదయ్య, ఏవో కృష్ణయ్య, తిరుపతమ్మ, పవన్ కుమార్, మహాలక్ష్మి, తిప్పిరెడ్డి పిచ్చారెడ్డి, వెన్నా వెంకటరెడ్డి, బద్దూరి వీరారెడ్డి పాల్గొన్నారు.

బాలికలు ధైర్యంగా ఉండాలి

● జిల్లా మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుభాషిణి



మాట్లాడుతున్న పల్నాడు జిల్లా మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుభాషిణి

నకకరికల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో జరిగిన సంఘటనల పై ప్రతి బాలిక అవగాహన కలిగి ఉండాలని. అపరిచితుల వాహనాలను ఎక్కడం వంటివి చేయరాదని పల్నాడు జిల్లా మహిళా పోలీసుస్టేషన్ సీఐ సుభాషిణి తెలిపారు. బుధవారం నకరికల్లు కేజీబీవీలో ఆమె శక్తియాప్ గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ఎవరితోనైనా ధైర్యం గా మాట్లాడాలని స్పష్టంచేశారు. ఆమెతో పాటు సత్తెనపల్లి ఎస్ఐ సంధ్యారాణి, నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్, ప్రిన్సిపాల్ కొండవీటి లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు రుణ అర్హత మేళ

గురజాలటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గురజాల నగర పంచాయతీ పరిధిలో బీసీ, ఈబీసీ, కాపు కార్పొరేషన్ కింద దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రుణ అర్హత మేళా నిర్వహించనున్నట్లు కమిషనర్ శివన్నారాయణ బుధవారం తెలిపారు. రుణమేళాకు అప్లికేషన్ ఫారం, ఆధార్, రేషన్ కార్డు జిరాక్సులతో హాజరుకావాలన్నారు.

నకరికల్లులో...

నకకరికల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 3వ తేదీ రుణమేళా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. దరఖాస్తుదారులు ఉదయం 10:30గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

కారంపూడిలో...

కారంపూడి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం రుణ అర్హత మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. దరఖాస్తుదారులు పాల్గొనాలని సూచించారు.

విజువల్ పోలీసింగ్

సత్తెనపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీఐ బ్రహ్మయ్య ఆధ్వర్యంలో బుధవారం రాత్రి విజువల్ పోలీసింగ్ నిర్వహించారు. పట్టణంలోని పలు వీధుల్లో పర్యటించి ప్రజలు, వ్యాపారులతో మాట్లాడారు. ఎస్ఐ సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పట్టణ సీఐ ప్రభాకరరావు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి సీఐ ప్రభాకరరావు

మాచర్లటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ పి.ప్రభాకరరావు అన్నారు. బుధవారం పట్టణంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను రోడ్లపై ఎక్కడపడితే అక్కడ నిలపవద్దని హెచ్చరించారు. వాహనచోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, వాహన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. ట్రిపుల్ డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొబ్బరిబోండాల వ్యాపారులను రోడ్డుమార్జిన్ దాటి ముందుకు రావొద్దని సూచించారు. సీఐ వెంట ఎస్ఐలు నరసింహులు, సంధ్యారాణి, హెడ్ కానిస్టేబుల్ ప్రభుదాసు తదితరులు ఉన్నారు.

మోడల్‌స్కూల్స్‌తో ప్రయోజనం: ఎంఈవో

రెంటచింతల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో వున్న 10 ప్రాథమిక పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా రూపాంతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఈవో-2 శివ నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం తుమ్మకోటలో ఎస్సీ కాలనీలో పాఠశాలను తనిఖీచేసి స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్, సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 60మంది బాలబాలికలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎంఈవో వెంట హెచ్‌ఎం శ్రీదేవి, లక్ష్మీ ప్రసన్న, కమిటీ సభ్యులున్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యల్లాల

మాచర్లటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మాచర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యల్లాల రమేష్ ఎన్నికయ్యారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో బుధవారం ఈ ఎన్నిక జరిగింది. వైస్ ప్రెసిడెంట్‌గా ఉప్పు లక్ష్మీనారాయణ, సెక్రటరీగా మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, జాయింట్ సెక్రటరీగా జీవీ ప్రసాద్, ట్రెజరర్‌గా నాగెండ్ల శ్రీనివాసరావు, లైబ్రేరియన్‌గా ఆర్ శ్రీనివాసరావు, మహిళా అడ్వయిజర్‌గా నాగసంధ్య ఎన్నికయ్యారు.

దొరికిన పర్సును ఎస్ఐకు అప్పగించిన మహిళ

దుర్గి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దుర్గికి చెందిన పేరుబోయిన నీలా బస్సులో తనకు దొరికిన పర్సును దుర్గి పోలీస్‌స్టేషన్లో అందించింది. మంగళవారం రాత్రి గుంటూరు నుంచి దుర్గికి ఆర్టీసీ బస్సులో వస్తుండగా బస్సులో పర్సు కనిపించింది. బుధవారం ఆ పర్సును దుర్గిపోలీస్ స్టేషన్లో ఎస్ఐ సుదీర్‌కుమార్‌కు అప్పగించింది. పర్సులోని సెల్‌ఫోన్ ఆధారంగా ప్రకాశం జిల్లా మక్కెనవారిపాలెంకు చెందిన గుంజి వెంకటరత్నం పర్సు పోగొట్టుకున్నట్లు ఎస్ఐ గుర్తించి ఆమెకు సమాచారం అందించారు. వెంకటరత్నంను దుర్గి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి నీలా చేతుల మీదుగా ఆమెకు పర్సును అందించారు.

నకరికల్లు ఏపీవోగా ప్రసాదు

నకరికల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ఏపీవోగా జీ ప్రసాదును చిలకలూరిపేట నుంచి నకరికల్లుకు బదిలీ చేస్తూ డ్వామా పీడీ లింగమూర్తి ఉత్తర్వులు జారీచేసినట్టు ఎంపీడీవో కాశయ్య తెలిపారు. ఐటీడీపీ మాచర్లలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రామమూర్తిని నకరికల్లు టీఏగా బదిలీచేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు.

మిర్చి రైతులకు క్వింటాకు రూ.5వేలు బోనస్ ఇవ్వాలి

మిర్చి సాగుచేసిన రైతులకు క్వింటాకు రూ.5వేల చొప్పున బోనస్‌గా ఇవ్వాలని కౌలు రైతుసంఘం కార్యదర్శి గాడిదమళ్ళ పిచ్చారావు కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 4న గుంటూరు మిర్చియార్డు వద్ద ఆందోళనలో మిర్చిరైతులు పాల్గొనాలని కోరారు.

నేడు పైపులైన్ రైతులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భేటీ

కృష్ణపట్నం నుంచి హైదరాబాద్ వరకు నిర్మించనున్న బీపీసీఎల్ పైపులైన్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో గురువారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీదేవి, ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి రైతులతో సమావేశమవుతారని తహసీల్దార్ కే పుల్లారావు తెలిపారు. నకరికల్లు, నరసింగపాడు, చల్లగుండ్ల గ్రామాల్లోని భూములు కోల్పోతున్న రైతులు ఈ సమావేశానికి హాజరుకావాలన్నారు.

పిన్నెల్లి ఘటనపై విచారణకు సిద్ధమా!

● వైసీపీ నేతల మాటలపై మండిపడ్డ టీడీపీ నేతలు



మాట్లాడుతున్న మాచవరం, పిన్నెల్లి టీడీపీ నాయకులు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో అడ్డూ అదుపు లేకుండా పిన్నెల్లి గ్రామంలో మహిళలపై అత్యాచారాలు, భూ ఆక్రమణలు, దాడులకు పాల్పడి ఇప్పుడు నీతివాక్యాలు వల్లించడం సిగ్గుచేటుగా వుందని మాచవరం, పిన్నెల్లి టీడీపీ నాయకులు మండిపడ్డారు. బుధవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మండల పార్టీ కన్వీనర్ బడిగుంచల వెంకటేశ్వర్లు, పిన్నెల్లి మాజీ సర్పంచ్‌లు షేక్ చింతపల్లి సుభాని, షేక్ చింతపల్లి జానీబాషలు మాట్లాడుతూ పిన్నెల్లి గ్రామంలో గత ఐదేళ్లలో జరిగిన అరాచకాలపై బహిరంగ చర్చకు సిద్ధమేనా... వైసీపీ నేతల అరాచకాలను వెల్లడించేందుకు సిద్ధంగా వున్నామని టీడీపీ నాయకులు తెలిపారు. పిన్నెల్లికి చెందిన పెద్దసైదా గత ఐదేళ్లలో టీడీపీ వారిని ఊర్లో లేకుండా చేయాలన్న లక్ష్యంతో దాడులు, అక్రమకేసులు పెట్టి అప్పటి ఎస్ఐ కోటయ్యతో చిత్రహింసలు పెట్టించారన్నారు. దాడులు జరుగుతున్నాయని ఎస్ఐ కోటయ్యకు చెప్పినా మాపైనే అక్రమ కేసులు పెట్టారన్నారు. రెండేళ్ల క్రితం మాచవరానికి చెందిన టీడీపీ నేత యెలిశెట్టి శ్రీనుపై జరిగిన దాడి కేసులో ఇప్పుడు పోలీసులు అరెస్టు చేశారే తప్ప అక్రమకేసులు కాదన్నారు. మా అధినేత చంద్రబాబు, ఎమ్మెల్యే యరపతినేని సూచనలతో అధికారంలో వున్నా గొడవలకు పోవడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి, వైసీపీ నేతలు మాపైనే నిందలు వేస్తుంటే చూస్తూ ఊరుకోమన్నారు. పిన్నెల్లిలో టీడీపీ నాయకుల భూములను వైసీపీ నేతలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించి బ్యాంక్ రుణాలు పొందారని ఆధారాలతో అప్పటి అధికారులకు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. తప్పులు వారేచేసి ఇప్పుడు మాపై నిందలు వేస్తారా అని మండిపడ్డారు. మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ అమీర్ అలి మాట్లాడుతూ తురకపాలెంలో వృద్ధ దంపతులపై హత్యాయత్నం కేసు, తుమ్మలచెరువు సైదాపై దాడి ఘటనలపై కూడా విచారణ జరపాలన్నారు. సమావేశంలో యడ్లపల్లి రామారావు, కారు సైదా, మాచవరం మీరా మహబూబ్, పిక్కిలి నీలకంఠయ్య, జల్లా బ్రహ్మయ్య, సుద్దపల్లి శ్రీనివాసరావు, జక్కుల అప్పారావు, నలబోతుల చిన్నబ్బాయి, యెలిశెట్టి నెమలిరంగయ్య, నల్లబోతుల నరసింహారావు, మండ్ల కోటయ్య, బ్రహ్మయ్య, రామిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాల మూత.. ఆందోళనలో విద్యార్థులు

దాచేపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ సిలబస్‌తో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న డీఏవీ పాఠశాల గత పదిరోజులుగా మూతపడింది. దాచేపల్లి మండలం తంగెడ గ్రామంలో 20 సంవత్సరాల క్రితం ఈ పాఠశాలను ఏర్పాటుచేశారు. ఈ పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు బోధన చేస్తున్నారు. 900మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. 35మంది ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు. మార్చి 25 నుంచి మూసివేశారు. పాఠశాలను ఎప్పుడుతెరుస్తారో తెలియక విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు విద్యార్థులను తీసుకువచ్చే బస్సులు మరమ్మతులకు గురయ్యాయని, వాటి మరమ్మతులకు ఎంత సమయం పడుతుందో తెలియదని నిర్వాహకులు చెప్పే కారణాలు విని తల్లిదండ్రులు విస్తుపోతున్నారు. ఈ పాఠశాలలో పరిసర గ్రామాల విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇప్పటికైనా యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని పాఠశాలను ఓపెన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మధుసూదనరావును వివరణ కోరగా పాఠశాల బస్సులు మరమ్మతులకు గురయ్యాయన్నారు. దీంతో పాఠశాల నిర్వహణ ఆపివేయాలని మేనేజ్‌మెంట్ నుంచి నోటీసు రావటంతో సెలవులు ఇచ్చినట్టు తెలిపారు.




షాపులను తొలగించాలని ఆక్రమణదారులకు సూచిస్తున్న సిబ్బంది

ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించండి

● మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ

గురజాలటౌన్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండో సచివాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు డ్రైనేజీపై తాత్కాలిక షాపుల ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శివన్నారాయణ కోరారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారణ, డ్రైనేజీ మురుగు శుభ్రం చేసేందుకు ఆక్రమణలను తొలగించాల్సి ఉందన్నారు. రెండో దశలో ప్రభుత్వ హాస్పిటల్ నుంచి రెండో సచివాలయం వరకు, పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం నుంచి మాచర్ల రహదారి వరకు ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం మున్సిపల్ సిబ్బంది ఆక్రమణదారుల వద్దకు వెళ్లి షాపులను తొలగించాలని కోరారు.

గల్లంతైన యువకుడి మృతదేహం వెలికితీత



హర్షతుల్లా (ఫైల్)

నకరికల్లు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో మార్చి 31వ తేదీన కొట్టుకుపోయిన రాజుపాలెం మండలం పెదనెమలిపురి గ్రామానికి చెందిన చిట్యాల హర్షతుల్లా (21) మృతదేహాన్ని పోలీసులు బుధవారం వెలికితీయించారు. హర్షతుల్లా వెటర్నరీ డిప్లమో చదువుకున్నాడు. మృతుని తండ్రి బేల్‌దారి పనిచేస్తుంటాడు. తండ్రి ఫిర్యాదుమేరకు ఎస్ఐ చల్లా సురేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నాడు.

కృష్ణానదిలో గల్లంతైన రాజేష్ మృతదేహం లభ్యం

అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మంగళవారం కృష్ణానదిలో చేపలు పట్టేందుకు దిగి నీటిలో గల్లంతైన ఎన్ రాజేష్ మృతదేహం బుధవారం లభ్యమైంది. రాజేష్ ఆచూకీకోసం 15మంది నదిలో గాలించగా మధ్యాహ్నం మృతదేహం నీటిపైతేలింది. మృతదేహానికి పంచనామా నిర్వహించి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టంచేసి కుటుంబసభ్యులకు అప్పగించారు.

బ్లేడుతో దాడి

సత్తెనపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు బ్లేడుతో ఇద్దరు యువకులపై దాడిచేసి గాయపరిచిన సంఘటన పట్టణంలోని బోయ కాలనీలో బుధవారం రాత్రి జరిగింది. బోయకాలనీకి చెందిన అశోక్ అనే యువకుడు మద్యంమత్తులో ఇంటి ఎదుట ఆడుకుంటున్న చాణక్య అనే బాలుడిని తీవ్రంగా కొట్టాడు. అదేమని ప్రశ్నించిన బాలుడి బంధువులైన శ్రీకాంత్, నవీన్‌లపై బ్లేడుతో దాడిచేసి గాయపరిచాడు. వీరిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదుమేరకు పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడిచేసిన యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

సత్తెనపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): అప్పుగా తీసుకున్న డబ్బు చెల్లించాలని బెదిరిస్తున్నాడని 29 వార్డుకు చెందిన షేక్ ఖాజా బుధవారం ఎలుకల పేస్ట్ తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. మండలంలోని వెన్నాదేవికి చెందిన వెంకట్ అనే యువకుడి వద్ద రూ.3.70లక్షలు అప్పుగా తీసుకున్నానని, డబ్బు చెల్లించాలని ఇంటికి వచ్చి వెంకట్ బెదిరించటంతో ఆత్మహత్యకు యత్నించినట్లు ఖాజా తెలిపాడు. యువకుడిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఖాజా ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్


కారంపూడి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. ఈనెల 3వ తేదీన నరమాలపాడు, 4, 5 తేదీల్లో ఒప్పిచర్ల, 8, 9 తేదీల్లో కారంపూడి, 10న చింతపల్లి, 11వ తేదీన పేటసన్నిగండ్లలో నిర్వహిస్తారన్నారు. నూతన ఆధార్, అప్‌డేట్ తదితర సేవలు అందుతాయన్నారు.



- రేషన్ షాపుల వద్ద కొలిక్కిరాని ప్రక్రియ
- మూడు జిల్లాల్లో 5 లక్షల పైచిలుకు పెండింగ్
- నెలాఖరు వరకూ గడువు పొడిగింపు..
- ఆ లోగా పూర్తి కాకుంటే రేషన్ కట్..
- ఈనెల కూడా కనిపించని కందిపప్పు

ఎండీయూ వాహనాల వద్దే ఈకేవైసీ

రేషన్ కార్డుదారుల ఈ కేవైసీ ప్రక్రియ నత్త నడకన సాగుతోంది. మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం పౌర సరఫరాల శాఖకు ఆదేశాలు ఇచ్చినా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. రేషన్ షాపులకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకునేందుకు కార్డు సభ్యులు ఆసక్తి చూపకపోవడం, కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడం వంటి పలు కారణాలతో మార్చి 31 నాటికి పూర్తి కావాల్సిన ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో ప్రభుత్వం గడువును మరో నెల రోజులకు పెంచింది. ఏప్రిల్ 30 వరకూ జరిగే ఈ ప్రక్రియలో కార్డు దారులకు మరింత వెసులుబాటు కల్పించేలా ఎండీయూ వాహనాల వద్దే ఈ- కేవైసీ చేయించుకునే సదుపాయం కల్పించారు.



ఈ-కేవైసీ పూర్తయినవి పచ్చరంగు, పెండింగ్ ఎరుపు రంగులో

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో 5,99,558, పల్నాడు జిల్లాలో 6,45,126, బాపట్ల జిల్లాలో 4,86,151 కార్డుల చొప్పున మూడు జిల్లాల్లో 17,30,835 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిపై 48,63,305 మందికి రేషన్ అందుతోంది. వీరిలో మూడు జిల్లాల్లో 5 లక్షల పేర్ల వరకూ పెండింగ్ ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ- కేవైసీ ప్రక్రియ గతంలో జరిగిన సమయంలో చిన్నారుల వేలు ముద్రలు పడకపోవడం వంటి కారణాలతో ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నెంబర్‌తో పేర్లను కార్డులో జత చేశారు. అయితే ఇప్పుడు వారిలో ఐదేళ్ల దాటినవారు ఉంటే వారి చేత ఈ- కేవైసీ చేయిస్తున్నారు. వారితోపాటు వలస పనులకు వెళ్లినవారు అనేక మంది ఈ- కేవైసీ చేయించుకోలేకపోయారు. వారికి కూడా ఈసారి అవకాశం కల్పించారు. వారు తాము పనిచేసే ప్రాంతాల్లోనే మీ-సేవ, ఈ- సేవా కేంద్రాలకు వెళ్లి ఈ- కేవైసీ చేయించుకునే అవకాశం కల్పించారు. అయితే కిందటి నెల ఈ- కేవైసీ బాధ్యతను రేషన్ డీలర్లకు అప్పగించారు. రేషన్ సరుకులు ఇళ్లకే వస్తున్న నేపథ్యంలో ప్రత్యేకంగా పనిగట్టుకుని రేషన్ షాపులకు వెళ్లాల్సి రావడంతో ఎవరూ పెద్దగా ఆసక్తి చూపలేదు. దీంతో ప్రక్రియ మందకొడిగా సాగింది. ఈ నెల రేషన్ సరుకులు ఇచ్చే సమయంలోనే ఎండీయూ వాహనం వద్దే ఈ- కేవైసీ చేయించుకునేందుకు అవకాశం కల్పించడంతో ప్రక్రియ ముందుకు సాగుతుందని అధికారులు భావిస్తున్నారు.

● సంక్షేమ పథకాల కోసం తప్పుకున్న కొందరు..

రేషన్ కార్డులో పేర్లు ఉండి ప్రభుత్వ ఉద్యోగం పొందినవారు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేవారు, ఇన్‌కమ్ టాక్స్ చెల్లింపుదారులు, నాలుగు చక్రాల వాహనదారులు చాలా మంది గత ప్రభుత్వ ఏరివేత విధానాల కారణంగా ఈ కేవైసీకి దూరంగా ఉన్నారు. కార్డు సభ్యుడిగా ఈ- కేవైసీ చేయించుకుంటే ఆ పథకాలు దూరమవుతాయన్న కారణంగా తప్పుకున్నారు. అలాంటి వారందరితో తప్పనిసరిగా ఈ- కేవైసీ చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పుడు కూడా ఈ- కేవైసీ చేయించుకోకపోతే రేషన్ కట్ చేస్తామని అధికారులు తేల్చి చెబుతున్నారు.

● ఈ- కేవైసీ ఇలా..

ఎండీయూ వాహనాల వద్ద రేషన్ తీసుకునే సమయంలో ఈపోస్ యంత్రంలో ఆయా కార్డుల్లో నమోదైన సభ్యుల పేర్లు స్ర్కీన్‌పై వస్తాయి. ఈ- కేవైసీ పూర్తయిన సభ్యుల వివరాల వద్ద పచ్చరంగు బార్ వస్తుంది. ఈ కేవైసీ స్టేటస్ వద్ద వెరిఫైడ్ అని వస్తుంది. ఈ- కేవైసీ పెండింగ్ ఉన్న పేర్ల వద్ద ఎర్ర రంగు బార్ వస్తుంది. ఈ కేవైసీ పెండింగ్ అని చూపుతుంది. అలా ఈ- కేవైసీ పెండింగ్ ఉన్నవారు అక్కడే బయోమెట్రిక్ ద్వారా ఈ- కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు.

● ఈనెల కూడా కనిపించని కందిపప్పు

కూటమి ప్రభుత్వం వచ్చాక రెండు మూడు నెలలపాటు అందుబాటులోకి వచ్చిన కందిపప్పు, జొన్నలు, రాగులు మూడు నెలలుగా కనిపించడం లేదు. ఈ నెల నుంచి కందిపప్పు పంపిణీ పునఃప్రారంభమవుతుందన్న ప్రచారం విస్తృతంగా జరిగింది. దీంతో అనేక మంది లబ్ధిదారులు కందిపప్పు కోసం ఎదురు చూశారు. కానీ ఈ నెల కూడా కందిపప్పు రాలేదు. దీంతో కార్డుదారులు నిరాశ చెందారు. కందిపప్పు ధర మండిపోతున్న తరుణంలో చౌకధరలో ప్రభుత్వం సరఫరా చేయాలని కోరుతున్నారు.

పల్లె యవనికపై కళాసౌరభం

రేపటి నుంచి పుచ్చలపల్లి సుందరయ్య జాతీయస్థాయి నాటకోత్సవాలు

యడ్లపాడులో మూడు రోజులపాటు నిర్వహణ



యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళాప్రాంగణం, ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదిక

యడ్లపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కళలు సంస్కృతికి ప్రతిబింబాలు..కళాకారులు సమాజాన్ని జాగృతం చేసే దివిటీలు.. కళాపరిషత్‌లు వాటికి జవసత్వాలు అందించే జీవనదులు. సినిమా, టీవీ, షార్ట్ ఫిల్మ్‌లు ఎంతగా వృద్ధిచెందినా వాటి మూలాలు మాత్రం నాటక రంగస్థలమే. కళలతోనే జీవితం.. కళలే వారి జీవితం అనుకునే తెలుగు కళామతల్లి ముద్దుబిడ్డలకు సాంస్కృతిక సేవా నిలయంగా నిలుస్తోంది యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం. కళ కళకోసం కాదు.. సమాజ హితం కోసం అంటూ పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో రెండు దశాబ్దాలకు పైగా నాటకోత్సవాలను నిర్వహిస్తూ కళామతల్లికి సేవలందిస్తోంది పుచ్చలపల్లి కళానిలయం. తెలుగు నాటకరంగానికి జవసత్వాలు కల్పించి ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నూతన ఒరవడితో ముందుకు సాగుతోంది. రేపటి (శుక్రవారం) నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్న పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటికల పోటీలపై ప్రత్యేక కథనం.

ఆదర్శనేత పుచ్చలపల్లి సుందరయ్య పేరుతో రెండు దశాబ్దాలకు పైగా నాటిక పోటీలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం. గతంలో స్మారక నాటకోత్సవాలుగా మాత్రమే నిర్వహించి ప్రదర్శనా పారితోషికం మాత్రమే అందజేసేవారు. అయితే మూడేళ్ళుగా నిర్వాహకులు నాటకోత్సవాల నిర్వహణలో మార్పులు చేపట్టారు. నాటకాల పట్ల ప్రజల్లో ఆసక్తిని పెంపొందించి చేరువ చేయడంతోపాటు కళాకారులను, నాటక సమాజాలను ప్రోత్సహించేందుకు జాతీయస్థాయి నాటికల పోటీలుగా మార్పు చేశారు.

మెప్పు కాదు.. మార్పు కోసం..



కళ కళ కోసం కాదు.. ప్రగతి కోసం అని చాటి చెప్పిన మహనీయుల మాటలే ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతున్నాం. నాటకోత్సవాలు నిర్వహించడం కత్తి మీద సాములాంటిది. ఎన్ని వ్యయప్రయాసలు ఎదురైనా మహనీయుల మాటలు, ప్రేక్షకుల ఆదరణ ముందుకు నడిపిస్తున్నాయి. కళారంగానికి పరిపుష్టతను అందించేందుకు వినూత్నంగా, విభిన్నంగా అందరినీ ఆకట్టుకునే విధంగా పోటీలకు తగినట్లుగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన లైటింగ్ ఎఫెక్ట్స్, స్టేజి అలంకరణ వేదికవే పోటీపడుతూ ప్రదర్శితమయ్యే నాటికలు వాటి ప్రత్యేకతను చాటుకుంటాయన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్ళి ఆహ్వాన పత్రిక, లక్కీడ్రా కూపన్లను ఇచ్చి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

-ముత్తవరపు సురేష్‌బాబు, పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షులు

ఎయిమ్స్ అభివృద్ధిపై కేంద్రమంత్రికి పెమ్మసాని వినతి



కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న పెమ్మసాని

మంగళగిరి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ ఆసుపత్రిలో పూర్తిస్థాయి పడకలు (960) ఏర్పాటు చేయించడంతోపాటు ఖాళీగా వున్న 1,045 పోస్టులను భర్తీ చేయించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర గ్రామీణ, కమ్యూనికేషన్స్‌శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బుధవారం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని మంత్రి కార్యాలయంలో పెమ్మసాని ఆమెను కలుసుకుని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఏటా అయ్యే రూ.250 కోట్ల ఖర్చును కేంద్రం అదనంగా భరించేలా ఆర్థికమంత్రి తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. గత నెల 28న డాక్టర్ పెమ్మసాని మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా సిబ్బంది ఆయన దృష్టికి ఆయా సమస్యలను తీసుకువెళ్లారు. దీంతో ఆయన ఈ సమస్యలను కేంద్ర ఆర్థికశాఖమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఆసుపత్రిలో 105 ఫ్యాకల్టీ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ రెసిడెంట్, నర్సింగ్ కేడర్, నాన్ ఫ్యాకల్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వినతిపత్రంలో వివరించారు. అలాగే సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ మంగళగిరి ఎయిమ్స్‌కు కేటాయించిన మొత్తం 960 పడకలను కూడా పూర్తిస్థాయిలో సత్వరమే అందుబాటులోకి తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డాక్టర్ పెమ్మసాని ప్రతిపాదనలపై ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్ అభ్యున్నతికి మోదీ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఎల్లప్పుడూ సహకరిస్తాయని...తప్పక తనవంతు సహకారం అందిస్తానని ఆమె భరోసాను ఇచ్చినట్టు డాక్టర్ పెమ్మసాని తెలిపారు.

గుంటూరు రైల్వే డివిజన్ చరిత్రలో... 3.451 మిలియన్ టన్నుల సరుకు రవాణా

గుంటూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సరుకు రవాణా విషయంలో గుంటూరు రైల్వే డివిజన్ సరికొత్త రికార్డు సృష్టించింది. డివిజన్ ఏర్పడిన తర్వాత ప్రప్రథమంగా 3.451 మిలియన్ టన్నుల సరుకులను రవాణా చేసి గత రికార్డులను తిరగ రాసింది. గత ఏడాది 3 మిలియన్ టన్నులను దాటి కొంతమేరకే సరుకులను లోడింగ్ చేయగలిగింది. ఈ ఏడాది మరింత జోరుగా రవాణా చేయడంతో రికార్డు నెలకొల్పినట్లు అయిది. ఇందుకోసం పటిష్టమైన ప్రణాళిక, సిబ్బంది అంకితభావం, టీం వర్కు తోడైంది. ముఖ్యంగా కమర్షియల్, ఆపరేటింగ్ విభాగాలు సమన్వయంతో పని చేశాయని వాటి విభాగాల అధికారులను డీఆర్ఎం రామ కృష్ణ అభినందించారు. 2024-25 ఆర్థిక సంవత్స రంలో మరికొన్ని విజయాలు కూడా డివిజన్ సా ధించింది. వాటిల్లో గత ఏడాదితో పోలిస్తే డివిజ న్‌లో రైళ్ల, గూడ్స్‌ల వేగం 20 శాతం పెరిగింది. రోలింగ్ బ్లాక్ కారిడార్ ప్రోగ్రాంలో 95.91 శాతం బ్లాక్‌లు మంజూరు చేశారు. ఇప్పటివరకు డివిజన్ మొత్తం 100 లాంగ్ హాల్స్(పొడవాటి గూడ్స్ రైళ్లు)కు సరుకులు లోడింగ్ చేసింది. రైళ్ల సమ యపాలన విషయంలో దేశంలో 10వ స్థానం, దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో ప్రథమ స్థానంలో నిలవడం విశేషం.

పరుగులు పెట్టిన పడవల వేలం

◆ ఉమ్మడి జిల్లా పరిషత్ ఆదాయపు పంట ◆ ఈ ఏడాది రూ. 1.46 కోట్ల రాబడి ◆ రూ. 50 లక్షలు పలికిన దిడుగు-ఏటూరు రేవు



బహిరంగ వేలం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని రేవుల్లో సంవత్సర కాలం పడవలు నడుపుకునేందుకు నిర్వహించిన వేలం పాటలు పరుగులు పెట్టాయి. జిల్లా పరిషత్ సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ పాటలు నిర్వహించారు. వేలం పాటలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల నుంచి ఎక్కువ మంది హాజరయ్యారు. అన్ని రేవులకు అధిక మొత్తంలో ఆదాయం వచ్చింది. అధికారులు ఊహించిన దానికంటే ఎక్కువ ఆదాయం వచ్చినట్లుగా తెలుస్తోంది. అమరావతి మండలంలోని దిడుగు-ఏటూరు రేవుకు ఎక్కువ మంది పోటీ పడ్డారు.ఈ రేవులో పడవ నడుపుకునే హక్కు కోసం రూ. 50 లక్షలు చెల్లించేందుకు ముందుకు వచ్చారు. అచ్చంపేట మండలంలోని చామర్రు-కాసరబాద రేవుకు రూ.5,15,000, గింజుపల్లి-వేదాద్రి రేవుకు రూ. 14 లక్షలు, తాడువాయి-రామన్నపేట రేవుకు రూ.21 లక్షలు,మాడిపాడు-ముక్త్యాల రేవుకు రూ.30 లక్షల 15 వేలు, పుట్లగూడెం- రామన్నపేట రేవుకు రూ.24.66 లక్షలు, ధరనికోట-కునికినిపాడు రేవుకు రూ. 1.9 లక్షలు చొప్పున చెల్లించి పడవ నడిపే హక్కులు దక్కించుకున్నారు.అచ్చంపేట మండలం లోని చింతపల్లి-ఇస్తేపల్లి, మాడిపాడు-బుగ్గమాదారం, మాచవరం మండలంలోని గోవిందాపురం-చింతిర్యాల, కొల్లిపొర మండలంలోని వల్లభాపురం-వల్లూరి పాలెం రేవుల వేలం పాటలు వాయిదా పడ్డాయి. బల్లకట్టుల హక్కులు పాడుకునేందుకు ఎవ రూ ముందుకు రాలేదు. ప్రస్తుతం నిర్వహించిన వేలం పాటల వల్ల జిల్లా పరిషత్‌కు ఈ ఏడాది రూ.1.46 కోట్ల ఆదాయం వచ్చింది.

కార్పొరేట్ సంస్థలకు ధీటుగా సోనోవిజన్ వ్యాపార సేవలు

- గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి
- కోలాహలంగా సోనోవిజన్ లక్కీడ్రా



సోనోవిజన్ లక్కీడ్రా తీస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి పక్కన సంస్థ ఎండీ భాస్కరమూర్తి తదితరులు



విజేతను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, పక్కన సంస్థ ఎండీ భాస్కరమూర్తి తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కార్పొరేట్ సంస్థలకు ధీటు గా సోనోవిజన్ వ్యాపార సేవలు అందించటం అభినందనీయమని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ప్రశంసించారు. గుంటూరు లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని సోనోవిజన్ షోరూంలో సంస్థ మేనేజింగ్ డైరక్టర్ పీ భాస్కరమూర్తి నేతృత్వంలో లక్కీ డ్రా కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గళ్లా మాధవి నగరంలోని నాలుగు షోరూమ్‌లలో కొనుగోలుదారుల కూపన్‌లను లక్కీ డ్రాలో తీసి విజేతలను ప్రకటించారు. మొదటి విజేతగా సెల్‌ఫోన్‌ను కొనుగోలు చేసిన ఏటి అగ్రహారంనకు చెందిన నరసింహారావును (కూపన్ నెంబరు 66608) ప్రకటించారు. తొలి విజేతగా ఆయనకు మారుతీ సుజుకీ ఆల్టో 800 కారును అందజేయనున్నట్లు తెలిపారు. అలానే రెండో కూపన్‌ను ఖాతాదారులతో డ్రా తీసి నగరానికి చెందిన అభిరామ్‌ను (కూపన్ నెంబరు 24387) ప్రకటించారు. రెండో విజేతకు ఎల్ఈడీ టీవీ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలానే మూడో విజేత సీహెచ్ ఆనంద్‌స్వరూప్ (కూపన్ నెంబరు 77611) కు రిఫ్రిజిరేటర్ అందజేయనున్నట్లు చెప్పారు. నాలుగో విజేతగా జీ శ్రీనివాసరావు (కూపన్ నెంబరు 164470) వాషింగ్ మిషన్‌ను అందజేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఎంతో ప్రజాదరణతోనే ఐదు దశాబ్దాలకు పైగా సోనోవిజన్ సుదీర్ఘ వ్యాపార ప్రయాణం చేయగలిగిం దన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన ఎలక్ట్రానిక్ గృహోపకరణాలను అందజేయటం సంతోషదాయకమన్నారు. మరింత వ్యాపారాభివృద్ధి జరగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. సోనోవిజన్ ఎండీ పీ భాస్కరమూర్తి మాట్లాడుతూ 1969లో సోనోవిజన్‌ను స్థాపించి 56 ఏళ్ళుగా ప్రజలకు నాణ్యమైన, నమ్మకమైన బ్రాండ్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. నేటికి ఎనిమిదిన్నర లక్షల మంది కొనుగోలుదారులతో తెలుగురాష్ట్రాల్లో 71 షోరూమ్‌లతో సోనోవిజన్ వ్యాపారం చేస్తుందన్నారు. సామాన్య ప్రజలకు సైతం అందుబాటు ధరల్లో ఎలక్ట్రానిక్ గృహోపకర ణాలను జీరో ఫైనాన్స్ వడ్డీతో అందజేస్తున్నామన్నారు. ప్రధానంగా క్రెడిట్ కార్డ్స్ అమ్మకాలను ప్రోత్సహించేందుకు క్యాష్ బ్యాక్ ఆఫర్లతో విక్రయాలు జరుపుతున్నామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్‌మేనేజర్‌లు కోనేటి వెంకటేష్, ప్రసాద్, శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇది మల్లెల వేళయనీ

- పెదవడ్లపూడి, నూతక్కి ప్రాంతాల్లో అత్యధికంగా మల్లెతోటల సాగు
- వేలాది మందికి ఉపాధి అవకాశాలు

బాపట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మల్లె తోటల సోయగం చూడముచ్చటగా ఉంది. సువాసన వెదజల్లే మల్లెతోటల సాగుపట్ల సన్న,చిన్నకారు రైతులు ఆసక్తి చూపుతున్నారు. 10 సెంట్ల భూమి దగ్గర నుంచి ఎకరాలలో కూడా దీనిని సాగు చేస్తున్నారు. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి, స్టూవర్టుపురం,బేతపూడి, ధరివాదకొత్తపాలెం తదితర గరువు భూములలో సాగు చేస్తున్న తోటల్లో మల్లెపూలు విస్తారంగా పూస్తున్నాయి. జిల్లాలో 507 ఎకరాలలో దీనిని సాగు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అనధికారికంగా ఎంతో సాగు చేస్తున్నారు. మహిళల మనస్సుల్ని దోచే మల్లెపూలతోటలు జిల్లాలో మంచి దిగుబడి ఇస్తున్నాయి. ఈతోటలపై వేలాదిమంది జీవనోపాధి పొందుతున్నారు. బాపట్లప్రాంతంలో 20గ్రామాలు, రేపల్లె ప్రాంతంలో 20గ్రామాలలో, ఉమ్మడి గుంటూరుజిల్లాలో అత్యధికంగా పెదవడ్లపూడి, నూతక్కి గ్రామాలలో మల్లెల సాగు చేస్తున్నారు. ఆ తర్వాత బాపట్లప్రాంతంలో ఎక్కువగా సాగు చేస్తున్నారు. మల్లెపూల సోయగాలతో జిల్లాలోని చాలా ప్రాంతాలు విస్తరించాయి. వెదుళ్ళపల్లి పూలమార్కెట్ నుంచి పెద్దఎత్తున ఇతర ప్రాంతాలకు మల్లెపూలు ఎగుమతి అవుతున్నాయి. ఎంతోకాలంగా ఇక్కడ నుంచి లక్షల రూపాయల మార్కెట్ జరుగుతున్నది.

మల్లెతోటలకు ఆశిస్తున్న తెగుళ్ళు

చూడముచ్చటైన మల్లెతోటలపై కూడా తెగుళ్ళ ప్రభావం ఉంది. ప్రస్తుతం ఎర్రమొగ్గ, రెడ్‌స్పైడర్‌మైట్, ఎర్రనల్లి, ఎండుకొమ్మలు కనిపిస్తున్నాయి. వీటి నివారణకు సస్యరక్షణ చర్యలు చేపడితేనే దిగుబడులు పెరుగుతాయి. లేకుం టే గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. కావున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవనశాఖాధికారులు తెలియజేస్తున్నారు.

సస్య రక్షణ చర్యలు చేపట్టాలి

పీ జెన్నెమ్మ, జిల్లా ఉద్యానశాఖాధికారి



ఇసుకనేలలో మల్లెసాగు చేస్తున్నారు కాబట్టి కొన్నిచోట్ల ఎర్రమొగ్గ కనిపిస్తున్నది. దీని నివారణకు వర్మికంపోస్ట్ అధికంగా వాడటంతోపాటు క్లోరిపైరీఫాస్ రెండు మిల్లీలీటర్లు. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి. ఎండికొమ్మలు కనిపిస్తే కాపర్ ఆక్సిక్లోరైడ్ 3గ్రాములు లీటరు నీటికి చొప్పున, ఎర్రనల్లి, రెడ్‌స్పైడర్‌మైట్ కనిపిస్తే సల్ఫర్ 2గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసి నివారించుకోవాలి.



బాపట్ల మండలంలో సాగు చేస్తున్న మల్లెతోటలు

పల్నాడు వార్తలు

● నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట

హత్యాయత్నం ప్రణాళిక ఆడియోపై కేసు నమోదు

నూజెండ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం పథక రచన ఆడియో బయట పడటంతో ఐనవోలులో బుధవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బీవీ కృష్ణారావు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని అల్లిబాయి పాలెం గ్రామానికి చెందిన కర్నాటి వెంకటరావు, అదే గ్రామానికి చెందిన మీరావలికి గతంలో నగదు అప్పుగా ఇచ్చి ఉన్నాడు. ఈ విషయమై జరిగిన లావాదేవీల్లో మీరా వలి తన తమ్ముడు లాలయ్యతో కలసి హత్యాయత్నం పథకం గురించి ఫోన్‌లో చర్చించాడు. ఈ ఆడియో బహిర్గతం కావటంతో బాధితుడు వెంకటరావు ఫిర్యాదు మేరకు మీరావలి, లాలయ్యలపై కేసు నమోదు చేశామన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని దాడి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగటానికి డబ్బులు ఇవ్వలేదని వృద్ధురాలితో సహా నలుగురిపై దాడికి పాల్పడిన వారిపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు నమోదైంది. రెండో పట్టణ సీఐ హైమారావు, బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం ఈ నెల 1వ తేదీ రాత్రి 10:30గంటల సమయంలో ఎనిమిదో వార్డుకు చెందిన సయ్యద్ పిర్వలి, జాన్బీరా, జానీ మస్తాన్లు వారి ఇంటి ఎదుట ఉండగా అదే ప్రాంతానికి చెందిన చెందిన గౌస్ పీరా ఎలియాస్ గడ్డం అనే వ్యక్తి వచ్చి మద్యానికి డబ్బులు అడిగాడు. డబ్బులు లేవనడంతో ఘర్షణకు దిగాడు. తన అనుచరులు పది మందిని పిలిపించుకుని సయ్యద్ పిర్వలి, షేక్ గౌసపీర్ జానీ మస్తాన్ కాసింబిల ఇళ్ల లోకి వెళ్లి దాడిచేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ హైమారావు తెలిపారు.

ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలి: పీడీ ఝాన్సీ రాణి

నాదెండ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషించేలా ఆర్థిక సర్వే చేయాలని డీఆర్‌డీఏ పీడీ పాకాల ఝాన్సీరాణి అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్లలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాల జీవనోపాధి, అప్పులపై ఆర్థిక ప్రణాళిక అనే అంశంపై బుధవారం జరిగిన శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యానిమేటర్లు ఎన్యూమరేటర్లు చేసే ఆర్థిక సర్వే వాస్తవానికి దగ్గరగా ఉండాలన్నారు. ఈ నెల 10వ తేదీ లోగా ఈ సర్వేను పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో డీపీఎం హనుమా నాయక్, ఏపీఎం రమేష్‌బాబు, సీసీలు, సాంబశివరావు, హైమావతి, సుధారాణి, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రుణమేళా

వినుకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను బీసీ, ఈబీసీ, కాపు, జనరక్ ఫార్మసీ రుణ అర్హత మేళా గురువారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్ వెంకట్రావమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఉదయం 10గంటలకు మునిసిపల్ కార్యాలయం ఆవరణలో జరిగే రుణమేళాకు హాజరుకావాలన్నారు.

డీలర్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలి: తహసీల్దార్ బండి నిర్మల

రొంపిచర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ కార్డుదారులు డీలర్ల వద్ద ఈకేవైసీ పూర్తిచేయించుకోవాలని తహసీల్దార్ బండి నిర్మల బుధవారం తెలిపారు. మండలంలో 6,103మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉండగా ఏప్రిల్ 1వ తేదీ నాటికి 1038మంది ఈకేవైసీ చేయించుకున్నారన్నారు. మిగిలిన వారు కూడా ఈ నెల 30వ తేదీలోపు సంబంధిత రేషన్ డీలర్ల వద్ద చేయించుకోవాలన్నారు. ఐదు సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారికి ఈకేవైసీ అవసరం లేదన్నారు. ఈ కేవైసీ చేయించుకుంటేనే మే నెల నుంచి నిత్యావసరాలు వస్తాయని ఆమె తెలిపారు. కొత్తపల్లి, రెడ్డిపాలెం, చాకలికుంట తండాల్లో ఆధార్ క్యాంపులు పెట్టామన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ ఆధార్ క్యాంపులను నిర్వహించేలా వీఆర్వోలు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

అంజిబాబుకు గోనుగుంట్ల నివాళి

రొంపిచర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు లగడపాటి అంజిబాబు వర్ధంతి సందర్భంగా బుధవారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు నివాళులర్పించారు. సంతగుడిపాడులో జరిగిన ఈ కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, మందలపు వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

'బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రమాణ సీకారానికి తరలిరావాలి'

వినుకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15వ తేదీన ఏలూరులో జరిగే ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బ్రాహ్మణ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ యడవల్లి శ్రీనివాసశర్మ బుధవారం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పురోహితుల సంఘం అధ్యక్షుడు వి.శేషసాయి శర్మ, మారేపల్లి మూర్తి, నారాయణ ఆనందాచార్యులు, వేదాంత నరసింహాచార్యులు, తెలికేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

చిలకలూరిపేట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయి ప్రశాంతి వృద్ధాశ్రమం, కోటప్పకొండలోని మాతాజీ ఆశ్రమంలలో జనసేన నాయకులు బుధవారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చిలకలూరిపేట విద్యాసంఘం కార్యదర్శి మైలవరపు శివానందకుమార్ కుమారుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓఎస్డీ కృష్ణతేజ జన్మదినం సందర్భంగా జనసేన పార్టీ నాయకుడు ఎం.చరణ్ తేజ మిత్రమండలి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

రొంపిచర్లలోని పోలీసు క్వార్టర్స్ భవన సముదాయాలు



నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

రొంపిచర్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల గ్రామంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు నిరుపయోగంగా ఉన్నాయి. జడ్పీ పాఠశాల వెనుక పోలీసు క్వార్టర్స్, మండల పరిషత్ కార్యాలయం పక్కన కమ్యూనిటీ భవనం, పాత ప్రభుత్వ ఆస్పత్రి, పాత పశువుల ఆస్పత్రి భవనాలు నిరుపయోగంగా మారాయి. పలు ప్రభుత్వ శాఖలకు భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వారికైనా ఇవి కేటాయిస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. దీనిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి భవనాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అర్జీలు పరిష్కరించకుంటే బాధ్యులపై చర్యలు

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వివిధ సమస్యలపై ఆయన వద్దకు చేరుకొని వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్‌కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, లేనిపక్షంలో చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ప్రజాదర్బార్ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా ఉన్నా సహించబోమని, ప్రజలు మళ్లీమళ్లీ అదే సమస్యలతో రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే అని స్పష్టం చేశారు. మొత్తం 80 అర్జీలు రాగా ప్రధానంగా కార్పొరేషన్ లోన్లు, విద్యుత్, తాగునీరు, గృహాలకు సంబంధించిన సమస్యలు అర్జీలను అధికారులకు పంపి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

27 సంవత్సరాలుగా ప్రజల మధ్యనే

వినుకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): 27 సంవత్సరాలుగా గెలుపోటములతో నిమిత్తం లేకుండా సేవా కార్యక్రమాల్లో ప్రజల మధ్యనే ఉన్నామని, ఇక నుంచి ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం చేస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి తెలిపారు. పట్టణంలోని శివయ్య స్థూపం సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద చలివేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ ఇప్పటికే తమ సంస్థ తరఫున నిర్వహిస్తున్న ఉపకార వేతనాలు, వైద్య శిబిరాలు, నైపుణ్యాభివృద్ధి, ఇతర కార్యక్రమాలు, సివిల్స్ కోచింగ్‌కు చేయూత ఇవ్వడం జరుగుతుందన్నారు. సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని, ప్రజలకు మంచి చేసేందుకు కృషిచేస్తామన్నారు. 27 సంవత్సరాలుగా ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. వెనుకబడిన పల్నాడు జిల్లాలో ఇల్లులేని చెంచు, యానాదులకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో తాగునీటి పథకానికి రూ.161కోట్లు కాదని, రూ.190కోట్లు తెచ్చి మూడేళ్లల్లో ఇంటింటికి తాగునీరు అందిస్తామన్నారు. నాలుగేళ్లల్లో పల్నాడు వాటర్ గ్రిడ్ ద్వారా నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వారం రోజుల్లో రామలింగేశ్వరస్వామి ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తామని, తరువాత బీటీ రోడ్లు, మెట్ల దారి, ఆలయ అభివృద్ధిని కూడా పరుగులు పెట్టిస్తామన్నారు. అనంతరం లీలావతి మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పేదలకు కంటి శుక్లాల ఆపరేషన్లు చేయించి వేలమందికి కంటి చూపును అందించామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, మునిసిపల్ చైర్మన్ దస్తగిరి, జనసేన నాయకులు నాగశ్రీను రాయల్ పాల్గొన్నారు.



శివయ్య స్థూపం సెంటర్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, ఆయన సతీమణి లీలావతి

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

● సీపీఎం మండల కార్యదర్శి మోహన్‌చంద్

శావల్యాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం నుంచి కొత్తలూరుకు వెళ్లే మార్గంలో ప్రభుత్వం చేపట్టిన తారురోడ్డు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చంద్ డిమాండ్ చేశారు. తారు రోడ్డు నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. మోహన్‌చంద్ మాట్లాడుతూ ప్రభుత్వం తారురోడ్డు నిర్మాణాన్ని రెండు ప్యాకేజీలుగా విభజించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించిందన్నారు. కొత్తలూరు నుంచి పోట్లూరు డొంక వరకు తారురోడ్డు నిర్మాణం పూర్తయిందని, కానీ పోట్లూరు డొంక నుంచి శావల్యాపురం వరకు తారురోడ్డు నిర్మించేందుకు కాంట్రాక్టర్ నెలన్నర క్రితం రోడ్డును పగులగొట్టి నిర్మాణపనులు ప్రారంభించలేదన్నారు. దీంతో రోడ్డుపై రాళ్ళు, ముక్కలు బయటపడి ద్విచక్రవాహనాలపై వెళ్ళే ప్రయాణీకులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్ళానని, కానీ వారు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కొత్తలూరు వెళ్ళే మార్గంలో చిప్స్ పరిచిన రోడ్డు

ఇద్దరి మధ్య ఘర్షణను పార్టీలకు చుట్టడం తగదు

● మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండలం మేళ్ళవాగు తిరునాళ్ళ సందర్భంగా గుమ్మనంపాడులో ఇటీవల ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణ పార్టీలకు చుట్టడం తగదని మాజీ శాసనసభ్యుడు మక్కెన మల్లికార్జునరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీకి చెందిన సాంబిరెడ్డి అదే గ్రామానికి చెందిన వ్యక్తితో పాతకక్షల నేపథ్యంలో ఘర్షణకు పాల్పడ్డారన్నారు. తిరునాళ్ళ అనంతరం స్వగ్రామంలో దూషించుకున్నారే తప్ప దాడికి పాల్పడలేదన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు వినుకొండ నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి పెట్టారని, ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్చుకోలేక వైసీపీ నాయకులు ఈ విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ రైతు సంఘం నాయకులు పెమ్మసాని నాగేశ్వరరావు, రేమిడిచర్ల మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటేశ్వర రెడ్డి, బీజేపీ నాయకులు వై.లెనిన్, ఎ.నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునః నిర్మాణం కోసం విరాళం

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 2, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట బజార్, పులుపులవారి వీధిలోని వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం పునః నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారు. ఆలయంలో 16 స్తంభాలతో నూతనంగా నిర్మిస్తున్న ముఖ మండపమునకు ఐదో స్థంభం నిర్మాణం కోసంనరసరావుపేటకు చెందిన రాజమాత జ్యూయలర్స్ అధినేత జుజ్జురూ లక్ష్మీ ప్రసాదు (ముక్కు పుడకల ప్రసాద్), పద్మప్రియ దంపతులు రూ.3,01,116 విరాళం బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

పల్లె పండగ పనులను త్వరలో పూర్తి చేస్తాం: పంచాయతీరాజ్ డీఈఈ

శావల్యాపురం, ఏప్రిల్2 (ఆంధ్రజ్యోతి): వినుకొండ నియోజకవర్గంలో పల్లె పండగ పనులను త్వరలో పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ డీఈఈ గంగానాయక్ తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ పల్లె పండగ కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గంలో 148 అభివృద్ధి పనులకు ప్రభుత్వం రూ.10కోట్లు కేటాయించిందన్నారు. బొల్లాపల్లి, వినుకొండ మండలాల్లో ఇంకా 15పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. గతేడాది కురిసిన వర్షాలకు శావల్యాపురం మండలం ఇర్లపాడు నుంచి వెలమావారిపాలెం వెళ్ళే మార్గంలో వంతెన కూలిపోయిందని, ఎంపీపీ నిధులు రూ.4లక్షలతో కొత్తగా వంతెనను నిర్మిస్తున్నామన్నారు. బొందిలిపాలెం నుండి శానంపూడికి వెళ్ళే మార్గంలో రూ.2.45లక్షలతో చేపట్టిన గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. ఆయనతో పాటు పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీ అమ్మవారి తిరునాళ్ల

ఈపూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళలో చౌడేశ్వరీ అమ్మవారి తిరునాళ్ల బుధవారం వైభవంగా జరిగింది. పుట్టింటి వారు అమ్మవారికి చీర, సారెతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. గ్రామస్థులు అమ్మవారికి పొంగళ్ళు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. జ్యోతుల ఊరేగింపు నిర్వహించారు. విద్యుత్ ప్రభలపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.

మహిళ అనుమానాస్పద మృతి

చిలకలూరిపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలిరెడ్డిపాలెంకు చెందిన మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం పోలిరెడ్డిపాలెంకు చెందిన మహిళ (43) హెచ్‌ఐవీ బాధితురాలు. ఆమెకు పి.నాగమహేష్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఇద్దరూ కలసి గుంటూరులోని పలు దేవాలయాల వద్ద భిక్షాటనం చేస్తూ జీవిస్తున్నారు. మంగళవారం గుంటూరు నుంచి రైలులో వారు నరసరావుపేటకు వచ్చి ఆటోలో చిలకలూరిపేటకు వస్తుండగా దారి మధ్యలో ఆమె మరణించిందని నాగమహేష్ చెబుతున్నాడు. అయితే ఆమె మృతదేహాన్ని పట్టణంలోని ఆమె ఇంటికి సమీపంలో విడిచి అతడు పరారయ్యాడు. ఆ ప్రాంతవాసులు ఈ విషయాన్ని అర్బన్ పోలీసులకు తెలియజేయటంతో, అర్బన్ ఎస్‌ఐ చెన్నకేశవులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సింగ్ విద్యతో ఉన్నత అవకాశాలు

● జీఎన్ఎం అండ్ బీఎస్సీ కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలలో ఆర్డీవో

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ విద్యకు ఉన్నత అవకాశాలు ఉన్నాయని ఆర్డీవో కే మధులత అన్నారు. స్థానిక పీఎన్‌సీ అండ్ కేఆర్ విద్యాసంస్థలలో జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో కే మధులత మాట్లాడుతూ నర్సింగ్ విద్యను పూర్తి చేస్తే మంచి ఉద్యోగాలు సాధించగలుగుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ పీ శ్రీనివాసప్రసాదు, కళాశాల ప్రిన్సిపాల్ డీ గోపినాథ్, వైస్ ప్రిన్సిపాల్ బీ సజికల్పనా ప్రసంగించారు.

ఏప్రిల్ 11 నుంచి 14 వరకు అంబేద్కర్ జయంత్యుత్సవాలు

● కులనిర్మూలన సమితి రాష్ట్ర కార్యదర్శి కృష్ణ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పూలే జయంతి ఏప్రిల్ 11 నుంచి అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు అంబేద్కర్ జయంతోత్సవాలను ఘనంగా జరుపుకోవాలని కులనిర్మూలన సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ కోరారు. బుధవారం పట్టణంలోని గాంధీపార్కులో పూలే, అంబేద్కర్ జయంతి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కే కృష్ణ మాట్లాడుతూ పూలే, అంబేద్కర్ జయంతులను దళిత పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు, శిఖినం సాంబయ్య, కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లపూడి చిన్నప్రసాద్, సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, సి.అంజి, ఎన్.శ్రీనివాసరావు, ఆర్.రవిబాబు, ఆర్.దివ్య, కే స్వరూప్, ముళ్ళపూడి జయరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు గుంటూరులో జరిగే ధర్నా జయప్రదం చేయాలి: రాధాకృష్ణ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే మిర్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 4న గుంటూరు మిర్చి యార్డులో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై రాధాకృష్ణ బుధవారం పిలపునిచ్చారు. ధర్నాకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిర్చి సాగు చేసే రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే మిర్చి కొనుగోలు చేయాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు.

శంకరభారతీపురం హైస్కూల్లో పురాతన నాణేల ప్రదర్శన



పురాతన నాణేలను పరిశీలిస్తున్న విద్యార్థులు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో గల శంకరభారతి పురం జిల్లా పరిషత్ హైస్కూల్ లో దేశ, విదేశాలకు చెందిన పురాతన నాణేలు, కరెన్సీ నోట్లను బుధవారం ప్రదర్శన నిర్వహించారు. భారత స్కౌట్స్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన ప్రదర్శన ను స్థానిక టీడీపీ మండల నాయకులు గంగుల పెద్ది రెడ్డి ప్రారంభించారు. విశ్రాంత ఉపాధ్యాయులు మామిళ్ళ కృష్ణయ్య, కంబాల తిరుపతయ్య సేకరించిన పురాతన దేశ, విదేశీలకు చెందిన పురాతన నాణేలు, కరెన్సీ నోట్లను ప్రదర్శన నిర్వహించారు.

మోడల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

నూజెండ్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోడల్ పాఠశాల 9వ తరగతి విద్యార్థులు ఎక్స్‌పో 2025లో మోడల్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట శంకర భారతీపురం జడ్పీ హైస్కూల్‌లో బుధవారం జరిగిన ఎంటర్ ప్రెన్యూర్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఎక్స్‌పో 2025లో జిల్లా వ్యాప్తంగా పది పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా తమ పాఠశాలకు చెందిన హర్షవర్ధిని, భానుప్రియ, శ్రీవల్లి బాయిలు ఇంటర్యూ ఐడియాలతో ప్రాజెక్టు రూపకల్పన చేసి ప్రదర్శించారన్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లులో సవరణలు కోరాం

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

నరసరావుపేట టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ప్రవేశపెట్టిన వక్ఫ్‌బోర్డు బిల్లులో టీడీపీ నాలుగు సవరణలను సూచించినట్లు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య వెల్లడించారు. బుధవారం నరసరావుపేటలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వక్ఫ్ బోర్డుకు సంబంధించి చేసిన సవరణ ప్రతిపాదనల్లో మూడు అంశాలను అంగీకరించిందన్నారు. నాలుగవ అంశమైన ముస్లిమేతరులు ఇద్దరు బోర్డులో సభ్యులుగా ఉంచటంపై టీడీపీ పునరాలోచించాలని కోరిందన్నారు. ఏనాడు మైనారిటీల గురించి ఆలోచించని వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్‌లో వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందడానికి 272 ఓట్లు కావాలన్నారు. ఎన్‌డీఏకి 293మంది ఎంపీలు ఉన్నారని, చంద్రబాబునాయుడుకు ఉన్న 16మంది ఎంపీలు మద్దతు లేకపోయినా ఇంకా 277మంది సభ్యులు ఎన్‌డీఏకి ఉంటారని చెప్పారు. అప్పుడు వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణ బిల్లు టీడీపీ మద్దతు లేక పోయినా పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందన్నారు. ముస్లిమేతరులు సభ్యులుగా ఉంచడాన్ని పునరాలోచించమని చంద్రబాబునాయుడు చెప్పారని, అవసరమైతే ప్రధాని నరేంద్రమోడీని వ్యక్తిగతంగా కలిసి కూడా చెబుతారని వివరించారు. మోడీతో, ఎన్‌డీఏ ప్రభుత్వంతో సఖ్యత ఉంటేనే మనరాష్ట్రం అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. సఖ్యతగా ఉన్నాం కాబట్టే ఇన్ని కోట్ల రూపాయలు అమరావతికి, పోలవరానికి, రైతులకు వస్తున్నాయన్నారు. ముస్లింలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని చిత్తశుద్ధితో పనిచేస్తున్న నాయకుడు చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం అని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి చెప్పే మాటలన్నీ అబద్ధాలేనన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పులిమి వెంకట రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజలు నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

అధికారులు సమస్యలు పరిష్కరించాలి

● ప్రజా వేదికలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు


నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులను ఆదేశించారు. నరసరావుపేట పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రజావేదిక పబ్లిక్ గ్రీవెన్స్ బుధవారం నిర్వహించారు. మొత్తం 226 అర్జీలు వచ్చాయి. సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమస్యలను తెలియపరచి, త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వార్డులోనే సచివాలయాలకు వచ్చిన అర్జీలను సచివాలయ సిబ్బందికి పంపి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అర్హులందరికీ పెన్షన్, ఇంటి స్థలం కేటాయించాలని ఆదేశించారు. గత ప్రభుత్వం రీసర్వే పేరుతో ఇబ్బందిపడిన రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.



వెంకుపాలెం సమీపంలో కోళ్ల ఫారాలను పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖఅధికారులు

కోళ్ల ఫారాల్లో పశుసంవర్ధక శాఖ అధికారుల తనిఖీ

వినుకొండ, ఈపూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరగాయపాలెం, వెంకుపాలెం, పెదకంచర్ల, కోటప్పనగర్, ఈపూరు మండలంలోని చిట్టాపురం, శ్రీనగర్ ప్రాంతాల్లో కోళ్ల ఫారాలను జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాయిలర్, లేయర్ కోళ్ల ఫారాల్లోని కోళ్లను పరిశీలించి ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఫారంలో తీసుకుంటున్న బయో సెక్యూరిటీ పద్ధతుల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ఫారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి యజమానులకు వివరించారు. అదేవిధంగా బాయిలర్ కోళ్లకు మేత పద్ధతిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే అందుబాటులోని పశువైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వినుకొండ సహాయసంచాలకులు డాక్టర్ సరోజినిదేవి, ఈపూరు సహాయసంచాలకులు పయ్యావుల శ్రీనివాసమూర్తి, కొండ్రముట్ల పశువైద్యాధికారి గోపాలనాయక్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది నాగరాజు, శివశంకర్, శిరీషా తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందుకున్న విద్యార్థులతో దాతలు, ఉపాధ్యాయులు

తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఆర్థికసాయం

యడ్లపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న తల్లిదండ్రులు లేని విద్యార్థులకు దాతలు ఆర్థికసాయం అందించారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తల్లిదండ్రులు లేని పదిమంది విద్యార్థులకు ఒకొక్కరికి రూ.2వేలు చొప్పున అందజేశారు. ఈ మొత్తాన్ని గ్రామానికి చెందిన దాతలు మదర్ ఇండియా కాటన్ ట్రేడర్స్ యజమాని నంబూరు రమేష్ రూ.15వేలు, కన్నెగంటి వీరాంజనేయులు రూ.5వేలు అందించినట్లు హెచ్‌ఎం వెంకటరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ ఛైర్మన్ షేక్ జాన్‌సైదులు, గ్రామపెద్దలు నంబూరు శివరామకృష్ణయ్య, ఉపాధ్యాయులు రామాంజనేయులు, వి శ్రీనివాసరావు, టి.విజయ, శ్యామ్యూల్, సుధాకరరావు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రణాళికలు తయారు చేయాలి: ఏపీఎం వాసుబాబు

శావల్యాపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు జీవనోపాధి మార్గాలను కల్పించి ఆర్థికంగా వారి అభ్యున్నతి సాధించేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక ప్రణాళికలను ఎన్యూమరేటర్‌లు పారదర్శకంగా తయారు చేయాలని వెలుగు ఏపీఎం గుమ్మడిల్లి వాసుబాబు అన్నారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో సీసీలు, వీవోఏలు, గ్రామ సమైఖ్య సభ్యులలో మూడో బ్యాచ్‌కి బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భారతి, కార్యదర్శి కుమారి, క్లస్టర్ సీసీలు ఖాజావలి, మేరీకుమారి, కరుణమ్మ పాల్గొన్నారు.